విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
99492 22450
ప్రభాత సూర్య
www.suryaa.news

ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
28-1-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 01
సంచిక: 149

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# మోగిన నగారా!

- మునిసిపల్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల
- 116 మునిసిపాల్టీలు, 7 కార్పొరేషన్లలో ఎన్నికలు
- నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ.
- ఫిబ్రవరి 11న పోలింగ్, 13న ఫలితాలు
- అమల్లోకి వచ్చేసిన ఎన్నికల కోడ్
- 16న మేయర్లు, ఛైర్‌పర్సన్ల ఎన్నిక
- హైదరాబాద్, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లు,
- మరో 5 మునిసిపాల్టీలకు ఈ విడతలో లేవు



**ప్రభాత సూర్య తెలంగాణ బ్యూరో**

తెలంగాణలో మునిసిపల్ ఎన్నికల నగారా మోగింది. రాష్ట్రంలోని ఏడు కార్పోరేషన్లు, 116 మునిసిపాలిటీల పరిధిలో ఫిబ్రవరి 11న ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత 13న ఫలితాలను వెల్లడించనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మంగళవారం విడుదల చేశారు. పదవీకాలం ముగిసిన మున్సిపాలిటీలు,మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు సభ్యులను ఎన్నుకొనేందుకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



# ఆంధ్రజ్యోతి వర్సెస్ బీఆర్ఎస్



## మళ్లీ మొదటికి వచ్చిన పాత శత్రుత్వం

- తమ పార్టీ కార్యాలయాల్లోకి ఆంధ్రజ్యోతి,
- ఏబిఎన్ ప్రతినిధులు రావద్దన్న గులాబి పార్టీ
- ఏబిఎన్ డిబేట్లకు బీఆర్ఎస్ ప్రతినిధులు రారని ప్రకటన
- తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలోనూ ఇదే పరిస్థితి
- కేసీఆర్, ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ మధ్య వైరం
- ఫోన్ ట్యాపింగ్ కేసుపై వార్తలతో పరాకాష్ఠకు

తెలంగాణలో ఎన్నికలు ఇంకా చాలా దూరంలో ఉండగానే.. పొలిటికల్ వార్ ముదురుతోంది. ఓవైపు రాజకీయ పార్టీల మధ్య, మరోవైపు పార్టీలు-మీడియా మధ్య కూడా యుద్ధ వాతావరణం నెలకొంది. ఇప్పటికే రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ మధ్య తీవ్రమైన మాటల, రాతల యుద్ధం జరుగుతోంది. సింగరేణి నైనీ బ్లాక్ బొగ్గు టెండర్ల అంశమై ఇద్దరి మధ్య విమర్శలు-ప్రతి విమర్శలు తీవ్రంగా నడుస్తున్నాయి. ఇలాంటి సమయంలో బీఆర్ఎస్-ఆంధ్రజ్యోతి విషయంలోనూ అదే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే ఈ మీడియా అంటే బీఆర్ఎస్ నాయకులకు తీవ్రమైన ఆగ్రహం ఉంది.

**ప్రభాత సూర్య, తెలంగాణ బ్యూరో**



6లో

# ప్రతిపక్షాల విమర్శలను దీటుగా తిప్పికొట్టాలి

- మౌత్ టు మౌత్ ప్రచారం కొనసాగించాలి
- గుజరాత్ తరహా వరుస గెలుపును సాధించాలి
- వచ్చే ఎన్నికల్లో ప్రతి బూత్‌లో ఓట్లు పెరగాలే తప్ప తగ్గరాదు
- పార్టీలో అంతా యువకులే ఎక్కువగా ఉండడం సంతోషం
- జనసేన, బిజెపి నేతలను కలుపుకుంటూ పోవాలి
- పార్లమెంటరీ కమిటీల భేటీలో నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం



# దోచుకుంటున్న కార్పోరేట్ స్కూళ్లు

- తాను విద్యామంత్రి అయితే వాటిని మూయించేస్తా
- నల్లగొండలో ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ స్కూలు నిర్మాణం
- 8కోట్లతో అత్యాధునికంగా నిర్మించామన్న కోమటిరెడ్డి

2లో


# ప్రజలకు అత్యుత్తమ సేవలే లక్ష్యం

## భారత్-ఐరోపా సమాఖ్య మధ్య స్వేచ్ఛావాణిజ్యం ఒప్పందం కుదిరిందన్న ప్రధాని మోడీ

## వాణిజ్య ఒప్పందంతో తగ్గనున్న స్కాచ్, కార్ల ధరలు

**న్యూఢిల్లీ, ప్రభాత సూర్య:** భారత్-ఐరోపా సమాఖ్య మధ్య స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం కుదిరినట్లు ప్రధాని నరేంద్రమోదీ వెల్లడించారు. భారత్-ఈయూ మధ్య ఎఫ్‌టీఏ కుదిరింది. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు దీనిని మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా చర్చించుకుంటున్నారని పేర్కొన్నారు.





# మేడారం జాతరకు సర్వం సిద్ధం...

- నాలుగు రోజుల పాటు జరగనున్న మేడారం సమ్మక్క-సారక్క మహాజాతర ప్రారంభం
- ఈ వేడుకకు రెండు కోట్ల మందికి పైగా భక్తులు హాజరవుతారని అంచనా
- రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ. 251 కోట్లతో భారీ ఏర్పాట్లు
- భక్తుల కోసం ప్రత్యేక బస్సులు, రైళ్లు... అందుబాటులో హెలికాప్టర్ సేవలు!
- భద్రత కోసం 13,000 మంది పోలీసుల మోహరింపు, డ్రోన్లతో నిఘా

2లో

# తాను చెబుతున్న మొదటి దయ్యం అతనే

- అతనే గుంపు మేస్త్రీ రేవంత్‌కు గూఢచారి
- కెసిఆర్ ఎన్ని ఇడ్లీ తిన్నాడన్నది చేరవేసే ఏజెంట్
- మాజీ ఎంపి సంతోష్ రావుపై మండిపడ్డ కవిత



# బడ్జెట్ పద్దులకు తుది మెరుగులు

- నార్త్ బ్లాక్‌లో హల్వా వేడుకలు
- పాల్గొన్న ఆర్థికమంత్రి నిర్మలా సీతరామన్

# ప్రజలకు అత్యుత్తమ సేవలే లక్ష్యం

## రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు

- కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- పఠాన్‌చెరువులో ఇంటిగ్రేటెడ్ భవనానికి నేడు శంకుస్థాపన
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

2లో



# సిట్ విచారణకు హాజరైన సంతోష్ రావు

- ఐదు గంటల పాటు జోగినపల్లి సంతోష్ రావు విచారణ
- ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ మాజీ ఎంపీని ప్రశ్నించిన సిట్
- మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రశ్నించిన సిట్

# ప్రజలకు అత్యుత్తమ సేవలే లక్ష్యం

**హైదరాబాద్, ప్రభాత సూర్య:** తెలంగాణ ప్రజలకు వేగవంతంగా పారదర్శకంగా అత్యుత్తమ సేవలు అందించాలనే లక్ష్యంతో రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత పదేళ్లలో ఆనాటి పాలకుల స్వార్ధపూరిత నిర్ణయాల వల్ల రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టిపోయిందని విమర్శించారు. గడచిన రెండేళ్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాలు, సూచనల మేరకు భ్రష్టుపట్టిన వ్యవస్థను సంస్కరిస్తూ రెవెన్యూ సేవలను ప్రజలకు చేరువ చేస్తున్నామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల ఏర్పాటుపై మంగళవారం నాడు సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ .. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 క్లష్టర్‌లుగా విభజించి ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థికభారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నామని నిర్మాణంతో పాటు ఐదు సంవత్సరాల నిర్వహణాబాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని తెలిపారు. మూడు నుంచి ఐదు ఎకరాల స్థలంలో కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామని వివాహ రిజిస్ట్రేషన్ల కోసం మినీ మ్యారేజీ హాల్, గర్భిణీలకు, వృద్దులకు ప్రత్యేక వసతులు, విశాలమైన వెయిటింగ్ ఏరియా మహిళల కోసం ఫీడింగ్ రూమ్, చిన్నపిల్లల కోసం క్రెచ్, వృద్దులు, దివ్యాంగుల కోసం ఆధునిక లిఫ్ట్ సౌకర్యం తదితరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో మిగిలిన కార్యాలయాలకు శంకుస్థాపనలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రెండవ విడతలో జిల్లా కేంద్రాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలను నిర్మిస్తామని ఇందుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటికే తాలిమ్‌లో ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని జూన్ 2వ తేదీ నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.

# ప్రజలకు అత్యుత్తమ సేవలే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం గోవాలో ఇండియా ఎనర్జీ వీక్- 2026ను వర్చువల్‌గా ప్రారంభించిన సందర్భంగా ట్రేడ్ డీల్ గురించి మాట్లాడారు. ఈ ఒప్పందంతో భారత్, ఐరోపా ప్రజలకు అద్భుతమైన అవకాశాలను అందిస్తుంది. ప్రపంచంలోనే పెద్ద ఆర్థికవ్యవస్థల మధ్య సమన్వయానికి నిదర్శనం. ప్రపంచ జీడీపీలో ఇండియా, ఈయూ ఉమ్మడి వాటా 25శాతం. ప్రపంచవాణిజ్యంలో ఇది మూడోవంతుకు సమానం. ఈ డీల్ ఇరువర్గాల మధ్య వాణిజ్యాన్ని పెంపొదించడమేగాకుండా.. ప్రజాస్వామ్యం, చట్టబద్ధపాలనపై మన నిబద్ధతను బలోపేతం చేస్తుందని మోదీ వెల్లడించారు. ఈ ప్రకటన అనంతరం హైదరాబాద్ హౌస్‌లో మోదీ, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయన్ సమావేశమయ్యారు. వారు ఇండియా-ఈయూ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. ఇక ఈ ఎనర్జీ వీక్‌లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 150 దేశాలకు చెందిన ప్రతినిధులు గోవాకు వచ్చారు. మీరంతా ఇంధన భద్రత, సుస్థిర భవిష్యత్తు గురించి మాట్లాడేందుకు భారత్‌కు వచ్చారు. మా వద్ద భారీ రిఫైనింగ్ సామర్థ్యాలు ఉన్నాయి. ఈ విషయంలో మేం ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్నాం. త్వరలో నంబర్‌వన్ స్థానానికి చేరుకుంటాం అని వెల్లడించారు. భారత్- యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పూర్తయింది. 18 సంవత్సరాల నిరీక్షణ తర్వాత భారతదేశం, యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడం వైన్, విస్కీ ప్రియులు, లగ్జరీ కార్ల అభిమానులకు ఆనందాన్ని ఇస్తోంది. ఈ ట్రేడ్ డీల్ ద్వారా భారతీయ వస్తువులకు యూరోపియన్ మార్కెట్ల తలుపులు తెరుచుకుంటాయి. యూరప్ నుంచి దిగుమతి అయిన వస్తువులు భారతదేశంలో చౌకగా లభిస్తాయి. ఈ ఒప్పందాన్ని 'అన్ని వాణిజ్య ఒప్పందాలకు తల్లి' అని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ అభివర్ణించారు. ప్రస్తుతం యూకే నుంచి భారత్‌కు దిగుమతి అవుతున్న స్కాచ్ విస్కీ, జిన్‌పై 150 శాతం సుంకాలను విధిస్తున్నారు. తాజా ఒప్పందం నేపథ్యంలో ఆ సుంకాలు 20 శాతానికి తగ్గుతాయి. అయితే దీనిని వెంటనే కాకుండా 5-10 సంవత్సరాల కాల వ్యవధిలో అమలు చేస్తారు. దీంతో యూరప్‌నకు చెందిన ప్రీమియం జిన్‌లు, వైన్, వోడ్కాలు చౌకగా లభిస్తాయి.

# బడ్జెట్ పద్దులకు తుది మెరుగులు

**న్యూఢిల్లీ,ప్రభాత సూర్య:** ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టబోయే కేంద్ర బడ్జెట్‌కు సంబంధించిన పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా ఏటా నిర్వహించే హల్వా వేడుకను ఆర్థిక శాఖ కార్యాలయం నార్త్ బ్లాక్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ వేడుకలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రి పంకజ్ చౌధరీ పాల్గొన్నారు. అలాగే ఆర్థిక శాఖ పరిధిలోని అన్ని విభాగాల కార్యదర్శులు, బ్జడెట్ రూపకల్పనలో భాగమైన అధికారులు కూడా హాజరయ్యారు. అనంతరం ఆమె బ్జడెట్ ప్రెస్‌ను పరిశీలించారు. ప్రింటింగ్, ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. నిర్మలా సీతారామన్ బ్జడెట్ ప్రవేశపెట్టడం ఇది వరుసగా తొమ్మిదోసారి. ఒక వైపు అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, మరోవైపు మన దేశం 7.4శాతం వృద్ధి సాధిస్తున్న తరుణంలో ఈ బడ్జెట్ వెలువడనుంది. హల్వా వేడుకతో బ్జడెట్ లాక్-ఇన్ పీరియడ్ ప్రారంభం అవుతుంది. అంటే బ్జడెట్ తయారీలో ప్రత్యక్షంగా పాల్గొనే అధికారులు, సిబ్బంది పార్లమెంట్‌లో వార్షిక పద్దును ప్రవేశపెట్టేవరకు ఆ నార్త్ బ్లాక్‌లోనే ఉంటారు. వారు బయటకు వెళ్లడానికి వీలుండదు. వారు ఎల్లప్పుడూ సీసీటీవీ కెమెరాలు, భద్రతా సిబ్బంది నిఘాలో ఉంటారు. కనీసం వారు ఫోన్ చేయడానికి కూడా వీలుండదు. ఒకసారి పార్లమెంట్‌లో నిర్మలా సీతారామన్ బ్జడెట్ ప్రసంగం పూర్తయిన తర్వాతే వీరు బయటకు వస్తారు. అంటే ఐదురోజులపాటు వీరికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు ఉండవన్నమాట. 1950లో బడ్జెట్ ముద్రణ పక్రియ కొనసాగుతున్న సమయంలో లీక్ అవ్వడంతో ఈ లాక్-ఇన్ నిర్ణయం తీసుకున్నారు.

# సిట్ విచారణకు హాజరైన సంతోష్ రావు

హైదరాబాద్,జనవరి27(ఆర్‌ఎన్‌ఎ): బీఆర్‌ఎస్ పార్టీ కీలక నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌రావు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ఎదుట విచారణకు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో సిట్ అధికారులు ఆయనను విచారిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలంటూ సిట్ సోమవారం ఆయనకు నోటీసులు ఇచ్చింది. దాంతో ఇవాళ సంతోష్‌రావు సిట్ అధికారుల ఎదుట విచారణకు వచ్చారు. సోమవారం సిట్ నోటీసులు అందుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాను రేపు సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరవుతానని, కేసు సంబంధించి వారు అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెబుతానని అన్నారు. కాగా ఇదే కేసులో గతంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లను కూడా సిట్ విచారించింది. వారి వాంగ్మూలాలను నమోదు చేసింది. ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ప్రభాకర్ రావు నియామకం నిర్ణయం ఎవరిదని ప్రశ్నించిన సిట్‌బీఆర్‌ఎస్ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ రావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సుదీర్ఘంగా విచారించింది. సిట్ విచారణ కొద్దిసేపటి కిందట ముగిసింది. సాయంత్రం మూడు గంటలకు ప్రారంభమైన విచారణ ఐదు గంటల పాటు కొనసాగింది.

# తాను చెబుతున్న మొదటి దయ్యం అతనే

(మొదటి పేజీ తరువాయి)

**హైదరాబాద్ ,ప్రభాత సూర్య :** తాను చెప్పిన మొదటి దయ్యం సంతోష్ రావేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. ఉద్యమకారులకు ఉద్యమ నాయకుడిని దూరం చేసింది అతనేనని కవిత ఘాటుగా విమర్శించారు. గద్దర్ లాంటి నాయకులు గేటు బయట ఉండాల్సి వచ్చిందంటే దానికి కారణం ఆయనేనని ఆరోపించారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ రావుకు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన కామెంట్స్ చేశారు. సంతోష్ రావుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 'కేసీఆర్ దగ్గర ఉన్న మొదటి దెయ్యం సంతోష్ రావు' అని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డికి ప్రధాన గూఢాచారి కూడా సంతోష్ రావేనని ఆరోపించారు. ఫాంహౌస్‌లో కేసీఆర్ ఫుల్ ఇడ్లీ తిన్నారా? సగం ఇడ్లీ తిన్నారా? అనే సమాచారాన్ని రేవంత్‌కు సంతోష్ చేరవేస్తాడని వ్యంగ్యస్త్రాలు సంధించారు కవిత. బీఆర్‌ఎస్‌లో ఎందరో నేతలతో కన్నీళ్లు పెట్టించిన దుర్మార్గుడు సంతోష్ అని మండిపడ్డారు. ప్రగతి భవన్ గేటు బయట గద్దర్‌ను నిలబెట్టింది, ఈటల బీఆర్‌ఎస్ సస్పెండ్‌కు కారణం సంతోష్ రావే అని కవిత ఆరోపణలు గుప్పించారు. కేసీఆర్‌ను ఉద్యమకారులకు, పేద ప్రజలకు దూరం చేశారని మండిపడ్డారు. అలాంటి వ్యక్తికి అనుకూలంగా కేటీఆర్, హరీశ్ రావులు ట్వీట్లు పెట్టడాన్ని బీఆర్‌ఎస్ క్యాడర్ గమనించుకోవాలని కవిత సూచించారు. బీఆర్‌ఎస్‌లో అన్ని దుర్మార్గాలకు కారణం సంతోష్ రావేనని ఆరోపించారు. ఎం రేవంత్‌రెడ్డికి సంతోష్‌రావు గూఢచారి. నేను ముందునుంచి చెబుతున్న దెయ్యం ఆయనే. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ సంతోష్‌కు ఎలాంటి శిక్ష విధిస్తుందనేది వేచి చూడాలి. ఆయనకు శిక్ష పడుతుందన్న నమ్మకం నాకు లేదని కవిత వ్యాఖ్యానించారు. గుంపు మేస్త్రీ రేవంత్ తన గూఢాచారిని ఫోన్ ట్యాపింగ్ కేసులో కాపాడుకుంటాడని.. సిట్ అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కవిత డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎక్సైజ్ పోలీసులంటే గంజాయి సరఫరాదారులు, స్మగ్లర్లకు భయం లేదని కవిత అన్నారు. ఎక్సైజ్ పోలీసులు, అటవీశాఖ సిబ్బంది వద్ద ఆయుధాలు ఉంటేనే భయం ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో గృహ హింస పెరిగిపోతోందన్నారు.

# మేడారం జాతరకు సర్వం సిద్ధం...

తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర, మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర రేపు (జనవరి 28) ప్రారంభం కానుంది. ములుగు జిల్లాలోని మేడారం గ్రామంలో జరిగే ఈ నాలుగు రోజుల వేడుకకు దేశం నలుమూలల నుంచి సుమారు రెండు కోట్లకు పైగా భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్‌కు దాదాపు 240 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గిరిజన పుణ్యక్షేత్రం ఇప్పటికే జనసంద్రంగా మారింది.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా సహా పలు రాష్ట్రాల నుంచి గిరిజనులు, గిరిజనేతరులు ఈ జాతరకు పోటెత్తుతున్నారు. ఇప్పటికే గత కొద్ది రోజులుగా దాదాపు 10 లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. వనదేవతలైన సమ్మక్క, సారలమ్మల వీరత్వాన్ని, త్యాగాన్ని స్మరించుకుంటూ రెండేళ్లకోసారి ఈ జాతరను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.

ప్రభుత్వం భారీ ఏర్పాట్లుఈ ఏడాది జాతర కోసం రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 251 కోట్లు ఖర్చు చేసింది. 21 శాఖలకు చెందిన 42,000 మందికి పైగా అధికారులు, సిబ్బందిని, 2000 మంది ఆదివాసీ వాలంటీర్లను భక్తుల సేవ కోసం నియమించారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా 13,000 మంది పోలీసులను మోహరించారు. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత డ్రోన్లతో జాతరను పర్యవేక్షిస్తున్నారు. 1,418 ఎకరాల్లో 42 పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. జంపన్న వాగు వద్ద 200 మంది గజ ఈతగాళ్లను, 30 వైద్య శిబిరాల్లో 5,192 మంది వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. పారిశుధ్యం కోసం 5,000 మంది కార్మికులు, 5,700 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు.భక్తుల రవాణా కోసం టీజీఎస్‌ఆర్టీసీ 4,000 ప్రత్యేక బస్సులను, దక్షిణ మధ్య రైల్వే 28 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది.

# దోచుకుంటున్న కార్పోరేట్ స్కూళ్లు

(మొదటి పేజీ తరువాయి)

**నల్లగొండ,,ప్రభాత సూర్య :** కార్పొరేట్ స్కూళ్లలో అధిక ఫీజులతో ప్రజలను దోచుకుంటున్నారని.. తాను విద్యాశాఖ మంత్రి అయితే అలాంటి స్కూళ్లను మూసివేయిస్తానని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. విద్య వ్యాపారం కావద్దని తేల్చిచెప్పారు. మంగళవారం నల్గగొండ టౌన్‌లోని బొట్టుగూడలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన ప్రభుత్వ పాఠశాలను ఆయన ప్రారంభించారు. అనంతరం కోమటిరెడ్డి మాట్లాడుతూ.. 'నల్లగొండ ప్రజల రుణం తీర్చుకోవడానికే నల్లగొండ మున్సిపాలిటీని కార్పొరేషన్ చేశా. కేంద్రం నుండి నిధులు తెచ్చి నల్లగొండ రూపు రేఖలు మారుస్తానని అన్నారు.

నేను ప్రధాని నరేంద్ర మోదీని కలిస్తే వెయ్యి, 2 వేల కోట్ల రూపాయల నిధులైనా ఇస్తారు. విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుంది. నాకు ఉత్సాహం ఉంటే ఎన్నికల్లో మళ్లీ పోటీ చేస్తా. లేకుంటే ప్రతీక్ స్కూల్‌లో విద్యార్థులను చదివిస్తూ జీవితం గడుపుతానన్నారు. ఈ స్కూల్ విద్యార్థులను ఆణిముత్యాల్లా తీర్చిదిద్ది ఐఏఎస్, ఐపీఎస్‌లుగా తయారు చేయాలి. నిజాయితీగా బతికా.. పేద వారికి సహాయం చేశా. చదువంటే ర్యాంకులు మాత్రమే కాదని ఓ ఆలోచన చేశాం. విద్యకు ప్రాధాన్యత ఇచ్చి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నాం. బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాలలో పూర్తిగా డిజిటల్ విద్యను అందిస్తాం' అని అన్నారు. సరైన విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని వెంకట్‌రెడ్డి అన్నారు. విద్యకు రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. బొట్టుగూడలో అత్యాధునిక వసతులతో ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాలను ఆయన ప్రారంభించారు. రూ. 8కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ పాఠశాలలో అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడినా తొలి పదేళ్లలో మన సమస్యలు తీరలేదని మంత్రి అన్నారు. ప్రతి నియోజకవర్గంలో దాదాపు రూ. 200కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని.. కులమతాలకు అతీతంగా విద్యార్థులు చదువుకోవాలన్నది తమ ప్రభుత్వ ఆశయమని చెప్పారు.



# ఆంధ్రజ్యోతి వర్సెస్ బీఆర్ఎస్



(మొదటి పేజీ తరువాయి)

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సీఎంగా ఉండగా చాలా అంశాల్లో ఆంధ్రజ్యోతి నాటి ప్రభుత్వంతో తీవ్రంగా విభేదించింది. రెండేళ్ల కింద?ట బీఆర్‌ఎస్ అధికారం కోల్పోయి ప్రతిపక్షంలోకి మారినా.. ఆంధ్రజ్యోతి ఇప్పటికీ అదే వైఖరి కొనసాగిస్తోంది. దీనికి తగ్గట్లే ఏబీఎన్ చానల్లో డిబేట్లు జరుగుతుంటాయి. కాగా, తాజాగా జరిగిన డిబేట్ లో ప్రజెంటేటర్ వెంకటకృష్ణకు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావుకు మధ్య జ?రిగిన సంవాదం చోటుచేసుకొని వివాదానికి దారితీసింది.

## రవీందర్ రావు వ్యాఖ్యలతో..

కొద్ది రోజుల కిందట బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను ఫోన్ ట్యాపింగ్ కేసులో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్.. విచారణకు పిలిచింది. మేరకు కేటీఆర్ విచారణకు హాజరయ్యారు. అయితే, ఈ సందర్భంగా సిట్ విచారణ జరిపిన తీరు ఏబీఎన్ డిబేట్ లో ప్రస్తావనకు వచ్చింది. దీంతో మీడియాలో వచ్చిన కథనాలను ఎమ్మెల్సీ రవీందర్ రావు పరుష పదజాలంతో విమర్శించారు. పిచ్చి నా.. అంటూ నోరు జారారు. దీనిని వెంకటకృష్ణ ఖండించారు. రవీందర్ రావును కంట్రోల్ చేసుకోవాలని కోరారు. ఆ మాటలను వెనక్కు తీసుకోవాలని సూచించారు. కానీ, రవీందర్ రావు మాత్రం వెనక్కు తగ్గలేదు. తన మాటలను వెనక్కు తీసుకోనని స్పష్టం చేశారు. ప్రజెంటేటర్ ఎంతగా నచ్చజెప్పినా ఆయన వినలేదు. దీంతో చివరకు చేసేదేమీ లేక వెంకటకృష్ణ.. 'గెటవుట్ ఫ్రం మై డిబేట్' అంటూ తేల్చి చెప్పారు. దీనిని పదే పదే రిపీట్ చేశారు. చివ?ర?కు రవీందర్ రావు మైక్ ను కట్ చేయించారు. అయితే ఈ పరిణామమే ఇప్పుడు బీఆర్‌ఎస్ వర్సెస్ ఏబీఎన్ గా మారింది.

## మళ్లీ పాత రోజులు..

వాస్తవానికి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ చాలా సన్నిహితులు. వీరిద్దరి కుటుంబాల మధ్య కూడా మంచి అనుబంధమే ఉంది. కేసీఆర్ గురించి నాలుగు దశాబ్దాలకు పైగా తెలిసిన రాధాకృష్ణ.. బీఆర్‌ఎస్ తొలి ప్రభుత్వంలో మాత్రం విభేదించారు. ఒక దశలో ఏబీఎన్ చానెల్ ప్రసారాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం బ్యాన్ చేసింది. ఆ తర్వాత కొంతకాలానికి ఇరువురికి మధ్య మళ్లీ సత్సంబంధాలు ఏర్పడినా.. 2018లో బీఆర్‌ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చాక మళ్లీ పాత కథే పునరావృతం అయింది. ఈ సారి నిషేధం విధించలేదు కానీ.. శత్రుత్వ వైఖరి కొనసాగింది. చివరకు బీఆర్‌ఎస్ అధికారం కోల్పోయింది. అనంతరం ఈ 26 నెలలుగా ఆంధ్రజ్యోతితో బీఆర్‌ఎస్ కు అదే శత్రుత్వ వైఖరి కొన?సాగుతోంది. ఇటీవల ఏబీఎన్ డిబేట్లో తమ ఎమ్మెల్సీ రవీందర్ రావు పట్ల ప్రజెంటేటర్ వెంకటకృష్ణ దురుసుగా ప్రవర్తించాడంటూ బీఆర్‌ఎస్ తీవ్రంగా స్పందించింది. రవీందర్ రావు తెలంగాణ ఉద్యమకారుడని, ఆయన పట్ల వెంకటకృష్ణ వ్యవహరించిన తీరు సరికాదని పేర్కొంది. దీనికి నిరసనగా..

ఇకమీదట ఏబీఎన్ చానెల్ డిబేట్లలో తమ పార్టీ నుంచి ఎవరూ పాల్గొనబోరని ప్రకటించింది. అంతేకాకుండా.. పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్, జిల్లా కార్యాలయాల్లో జరిగే సమావేశాలకు ఇకపై ఏబీఎన్, ఆంధ్రజ్యోతి ప్రతినిధులను అనుమతించబోమని ట్వీట్ చేసింది. అయితే రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు ఎటువైపు వెళతాయో, రాష్ట్ర ప్రయోజనాలు ఏమవుతాయోనన్న ఆందోళనను ప్రజాస్వామ్యవాదులు వ్యక్తం చేస్తున్నారు.

# బీజేపీ, కాంగ్రెస్, టిడిపి,టీఆర్ఎస్, బిఎస్పీ పార్టీలు రజకుల ఎస్సీ హామీని నెరవేర్చాలి: గోపి రజక

## తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి .. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి



**వికారాబాద్, జనవరి 27( ప్రభాత సూర్య ):** ఈమధ్య కాలంలో అన్ని రాజకీయ పార్టీలు రజకులను ఎస్సీ జాబితాలో చేర్చుతామని వివిధ రూపాల్లో హామీ ఇవ్వడం జరిగింది కానీ మాటల వారికే పరిమితమైందని రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక ఆవేదన వ్యక్తంచేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా ఉపాధ్యక్షులు వెంకటయ్య అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక , అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు అన్నారం సాయిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా గోపి రజక మాట్లాడుతూ 2018 ఎలక్షన్లో మ్యానిఫెస్టోలో పెట్టిన బీజేపీ , యువగళం పాదయాత్రలో నారాచంద్రబాబు నాయకులు బహిరంగ సభలో టీడీపీ ప్రభుత్వం వస్తే నెరవేరుస్తామని , టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత శాసన మండలిలో ఎస్సీ జాబితాలో చేర్చాలని స్పీకర్ ను కోరడం , 2016 డిసెంబర్ 26న అసెంబ్లీలో ఏనుముల రేవంత్ రెడ్డి ఎస్సీ అంశంపై మాట్లాడటం ,జోడో యాత్రలో కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ ధోబీలను ఎస్సీలో చేర్చాలని స్పందించడం , బీఎస్పీ పార్టీకి ఎస్సీ జాబితాలో చేర్చాలని మెమోరండం ఇవ్వగా సానుకూలంగా స్పందించడం , ఎలక్షన్స్ ముందు డి.కె. అరుణ దృష్టికి మెమోరండం ద్వారా ఎస్సీ అంశాన్ని తీసుకెళ్ళగా ఎంపీగా గెలిచాక ప్రధాన మంత్రి నరేంద్రమోడీ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడం ,పార్లమెంటులో జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కారి , మధ్యప్రదేశ్ ఎంపీ ఎస్సీ అంశాన్ని లేవనెత్తారు. వివిధ పార్టీలు వివిధ రకాలుగా స్పందించినప్పటికి ఏ పార్టీ అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోకపోవడం చాలా బాధాకరమని ఇకనైనా రజకుల న్యాయమైన డిమాండ్ అని గుర్తించి ఏ విధంగానైతే ఇందిరా గాంధీ 56/84 ఆర్డినెన్స్ ద్వారా 18 రాష్ట్రాల రజకులను ఎస్సీ జాబితాలో చేర్చిందో అదే తరహాలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రజకులను ఎస్సీలో చేర్చి మా బతుకులు బాగు చేయడానికి కృషి చేయాలని గోపి రజక ప్రభుత్వాలను కోరారు. ఈ కార్యక్రమంలో బీమప్ప,నర్సిములు శ్యామప్ప, కృష్ణ ,తదితరులు పాల్గొన్నారు



# యమగాని బక్కయ్య తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి

### శోకసముద్రంలో మునిగిన సుద్దాల గ్రామం..

**గుండాల, జనవరి 27( ప్రభాత సూర్య ):** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల సుద్దాల గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గీత కార్మికుడు యమగాని బక్కయ్య మంగళవారం జీవనోపాధి కోసం తాటిచెట్టుపైకి ఎక్కి కల్లు తీస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు చెట్టు పై నుంచి కింద పడిపోయాడు. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే 108 అత్యవసర వైద్య సేవల సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బక్కయ్యను జనగామ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలోనే ఆయన పరిస్థితి విషమించి దురదృష్టవశాత్తు మృతి చెందినట్లు సమాచారం. బక్కయ్య మృతి విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రోజువారీ కష్టపడి పనిచేసే గీత కార్మికుడి అకాల మరణం గ్రామాన్ని శోకసంద్రంలో ముంచింది. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని అన్నారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత





### బొబ్బిళ్ళ మురళి ఆర్థిక సహాయంతో హెల్మెట్ లు పంపిణీ

### హెల్మెట్లు ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి...

### ట్రాఫిక్ సిఐ విజయమోహన్

**చౌటుప్పల్. జనవరి 27. ప్రభాత సూర్య :** రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని,ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ సిఐ విజయమోహన్ అన్నారు. మంగళవారం ట్రాఫిక్ భద్రతలో భాగంగా వాహనదారులకు ఉచితంగా లైన్స్ క్లబ్ చౌటుప్పల్ సేవ ఆధ్వర్యంలో బొబ్బిళ్ళ మురళి ఆర్థిక సహకారంతో అందజేసిన హెల్మెట్ల పంపిణీ కార్యక్రమంలో చౌటుప్పల్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ విజయ్ మోహన్ పాల్గొని తన చేతుల మీదుగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ విజయమోహన్ మాట్లాడుతూ... ప్రమాదాలకు గురైనప్పుడు అధిక శాతం హెల్మెట్ లేకపోవడం వల్లనే మృత్యువాత పడుతున్నారని తెలిపారు. హెల్మెట్ ధరిస్తే కనీసం ప్రాణాలతో బయటపడవచ్చని, అది తలకు రక్షణ కల్పిస్తుందని తెలిపారు. వాహన దారులు కచ్చితంగా భద్రత ప్రమాణాలు పాటించి రోడ్డుపై ప్రయాణం చేయాలని ముఖ్యంగా హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపద్దని తెలియజేశారు. వేగం కంటే క్షేమమే ముఖ్యమని ప్రతి ఒక్కరు గుర్తించాలని సూచించారు. వాహన దారులు వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ లో మాట్లాడంకాని, మద్యం సేవించి గాని వాహనం నడపవద్దని తెలిపారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేయడంలో ముందున్న లైన్స్ క్లబ్ చౌటుప్పల్ సేవ సభ్యులను అభినందించారు. వాహనదారులకు హెల్మెట్లు అందజేయడానికి ఆర్థికంగా సహకరించిన బొబ్బిళ్ళ మురళికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై సైదిరెడ్డి, ఏఎస్ఐ కాట్రగడ్డ శ్రీనివాస్, లైన్స్ క్లబ్ చౌటుప్పల్ సేవ అధ్యక్షులు తిరందాసు జగన్నాథం,ప్రధాన కార్యదర్శి అత్తార్ పాషా, లైన్స్ క్లబ్ సేవ సభ్యులు గోశిక కరుణాకర్, ఉప్పు ఆంజనేయులు,కాసుల వెంకటేశం,వనం రాజు, సత్యనారాయణ,చింతల ప్రభాకర్ రెడ్డి, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సర్వేల్ శ్రీ రామలింగేశ్వర స్వామి 93వ వార్షిక బ్రహ్మోత్సవాలకు

### సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి ఆహ్వాన పత్రిక అందజేత



**సంస్థాన్ నారాయణపురం, జనవరి 27(ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లాసంస్థాన్ నారాయణపురం మండల సర్వేల్ గ్రామంలో శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం 93వ వార్షిక బ్రహ్మోత్సవాలు 28-01-2026 నుండి 31-01-2026 వరకు నిర్వహిస్తున్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు నారాయణపురం సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి కి ఆహ్వాన పత్రిక అందజేసిన దేవాలయ చైర్మన్ సుర్వి యాదయ్య గౌడ్, ఎనుముల శంకర్ రెడ్డి, సుర్వి గోపీనాథ్ గౌడ్.



# శ్రీ శక్తి గణపతి దేవాలయ పునర్నిర్మాణ విగ్రహ ప్రతిష్ట కు రూ.1,51,000 వేల విరాళం అందజేత

### ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

### సామాజిక కార్యకర్త పుప్పాల అజయ్ కుమార్

**కూకట్ పల్లి, జనవరి 27 (ప్రభాత సూర్య) :** ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలుగా ఉంటాయని సామాజిక కార్యకర్త పుప్పాల అజయ్ కుమార్ అన్నారు. హైదరాబాద్ నగరంలోని ఛత్రినాక లోగల శ్రీ శక్తి గణపతి దేవాలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్టాపన ప్రధాన విగ్రహానికి దివంగత పుప్పాల పరమేశ్వరరావు జ్ఞాపకార్థం సతీమణి ప్రమీల దేవి కుటుంబ సభ్యులతో కలిసి ఛత్రినాక వ్యవస్థాపక అధ్యక్షులు పసునూరి పురుషోత్తం చారి, పుప్పాల రఘు, ప్రధాన కార్యదర్శి, రాకేష్ షిండే, కోశాధికారికి రూ.1,51,000 వేల విరాళాన్ని అందజేశారు. అనంతరం పుప్పాల అజయ్ కుమార్ మాట్లాడుతూ ఆలయాలకు విరాళం అందించడంలో ఎల్లప్పుడూ ముందుంటానని, నిరుపేదలకు చేయూతనిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పుప్పాల జ్యోతి, పుప్పాల అనిల్ కుమార్, పుప్పాల అశ్విన్, పుప్పాల ఆదర్శకుమార్, బంటి పుప్పాల, మిఖిల్ పుప్పాల, మనవాళ్లు, మనవరాళ్లు, కుంట అరవింద్ ఆలయ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందించారు.

# గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్న్ మెంట్....

**మియాపూర్ ప్రభాత సూర్య :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గల మియాపూర్ డివిజన్ బీజేపీ సీనియర్ నాయకుడు గుండె గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్న్ మెంట్ నిర్వహించాడు. ఫైనల్ పోటీలో మక్త వారియర్స్ కెప్టెన్ జె. శ్రీధర్ వర్సెస్ మక్త లెజెండ్రీ కెప్టెన్ కే నాగులు మధ్య పోటీ జరుగగా : మక్కా లెజెండ్ కే నాగులు టీమ్ గెలుపొందింది.. పోటీలో పాల్గొన్న వారికి ప్రోత్సాహక బహుమతులు, గెలుపొందిన టీం కు ట్రోఫీ అందజేశారు. యువత క్రీడలపై దృష్టి సారించాలని, క్రీడల వల్ల ఏకాగ్రతతో పాటు శరీరదార్యుడ్యం కూడా పెరుగుతుందనీ గణేష్ ముదిరాజ్ తెలిపాడు. జాజరవు శీను పాల్గొన్నారు



# థరూర్ మళ్లీ డుమ్మా కొట్టారు... ఈసారి ఎక్కడికి వెళ్లారంటే...!

- కాంగ్రెస్ కీలక సమావేశానికి మరోసారి దూరంగా శశి థరూర్
- దుబాయ్ లిటరేచర్ ఫెస్టివల్?లో పాల్గొంటున్న ఎంపీ
- పార్టీ మారుతున్నారనే ఊహాగానాలకు బలం చేకూరుస్తున్న పరిణామాలు
- అసంతృప్తి వార్తలను తోసిపుచ్చిన కాంగ్రెస్ వర్గాలు
- గతంలోనూ పలు భేటీలకు గైర్హాజరైన థరూర్



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ మరోసారి పార్టీ కీలక సమావేశానికి హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల వ్యూహంపై చర్చించేందుకు మంగళవారం సోనియా గాంధీ నివాసంలో జరిగిన ముఖ్యమైన భేటీకి ఆయన గైర్హాజరయ్యారు. ప్రస్తుతం ఆయన దుబాయ్‌లో జరుగుతున్న ఓ సాహిత్య ఉత్సవంలో పాల్గొంటున్నారు. కేంద్ర బడ్జెట్?పై అనుసరించాల్సిన వైఖరి, జీ-రామ్-జీ ఉపాధి హామీ పథకంపై ప్రభుత్వాన్ని నిలదీసే అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. అయితే, థరూర్ దుబాయ్ పర్యటనలో ఉండటంతో ఈ భేటీకి రాలేకపోయారని, ఆయన రాత్రికి తిరిగి వస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల కాలంలో థరూర్ పార్టీ సమావేశాలకు దూరంగా ఉండటం గమనార్హం. గత వారం కేరళలో రాహుల్ గాంధీ పర్యటన సందర్భంగా తనకు సరైన గౌరవం దక్కలేదని ఆయన అసంతృప్తితో ఉన్నారని ప్రచారం జరిగింది. అంతకుముందు నవంబర్, డిసెంబర్ నెలల్లో కూడా మూడు కీలక సమావేశాలకు ఆయన హాజరు కాలేదు. వరుస పరిణామాలతో ఆయన కాంగ్రెస్?ను వీడతారనే ఊహాగానాలు మళ్లీ మొదలయ్యాయి. అయితే, ఈ ఊహాగానాలను కాంగ్రెస్ వర్గాలు కొట్టిపారేస్తున్నాయి. థరూర్ పార్టీ సీనియర్ నేత అని, ఆయనకు ఏమైనా సమస్యలుంటే అధిష్ఠానం చర్చిస్తుందని స్పష్టం చేశాయి. మరోవైపు, తన పుస్తక ప్రచారం కోసమే దుబాయ్ వెళ్లినట్లు థరూర్ సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. విదేశంలో ఉన్నప్పుడు రాజకీయ విషయాలపై మాట్లాడటం సరికాదని థరూర్ పేర్కొన్నట్లు సమాచారం. మొత్తం మీద, ఈ పరిణామంతో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.



## డివిజన్ల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

**ఐదు కోట్ల 65 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జీఎంఆర్**



**రామచంద్రపురం జనవరి 27 ప్రభాత సూర్య:** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం భారతి నగర్, రామచంద్రాపురం డివిజన్ల పరిధిలో 5 కోట్ల 65 లక్షల రూపాయలు అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి. బల్దియా పరిధిలోని డివిజన్ల అభివృద్ధికి సంపూర్ణ సహకార అందిస్తున్నామని తెలిపారు. హాజరైన స్థానిక కార్పొరేటర్లు సింధు ఆదర్శ్ రెడ్డి, పుష్ప నగేష్, అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, డిఈ వెంకటరమణ, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, ఐలేష్ యాదవ్, ప్రమోద్ గౌడ్, ఆయా కాలనీల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దేశ వ్యాప్తంగా సమ్మె శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే కి సమ్మె నోటీస్..




**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** దేశవ్యాప్త జరిగే సమ్మెను జయప్రదం చేయాలని జిహెచ్ఎంసి శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే ఐ ఎ ఎస్. కి సమ్మె నోటీసును సిఐటియు, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కే చందు యాదవ్, సి ఐ టి యు సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు బి నాగేశ్వరరావు, సిఐటియు శేరిలింగంపల్లి కార్యదర్శి కే కృష్ణ ఏఐటియూసీ నాయకులు జె. శ్రీనివాస్, ఎస్ కొండలయ్య, బి నారాయణ పాల్గొన్నారు.

## ఒంటినిండా విషం నింపుకుని కాంగ్రెస్ పట్ల విషం చిమ్ముతున్నారు: పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**బీఆర్ఎస్ నేతలపై పొంగులేటి ఫైర్**

**తమ ప్రభుత్వం ప్రజల కోసమే పని చేస్తోందన్న మంత్రి**



బీఆర్ఎస్ నేతలు అధికారం కోల్పోయిన తర్వాత అచ్చోసిన ఆంబోతుల్లా రంకెలు వేస్తూ, ఒంటినిండా విషం నింపుకుని కాంగ్రెస్ పట్ల విషం చిమ్ముతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజల శ్రేయస్సు కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో రూపొందిన మంచి పథకాలను కొనసాగిస్తూ ముందుకు సాగుతున్నామని వివరించారు. రాబోయే ఏప్రిల్ నెలలో మళ్లీ కొత్త ఇళ్లు మంజూరు చేస్తామని, ఆ తర్వాత మరో మూడు దఫాలుగా ఇళ్లు మంజూరీ చేస్తామని ప్రకటించారు.ప్రజలు గతంలో ఏం జరిగిందో గుర్తుంచుకోవాలని, ప్రస్తుత ప్రభుత్వం ప్రజల కోసమే పని చేస్తోందని స్పష్టం చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కోరిక మేరకు నియోజకవర్గానికి రూ.1.30 కోట్ల నిధులు మంజూరు చేశానని ఎంపీ కడియం కావ్య స్పష్టం చేశారు. నియోజకవర్గ కేంద్ర అభివృద్ధికి తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుం దని ఆమె అన్నారు.ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, వర్ధన్నపేటలో మూడుసార్లు ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రిగా పని చేసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్?రావు ఎవరినీ ఎదగనీయకుండా ధృతరాష్ట్రుని పాలన చేశాడని విమర్శించారు. పాలకుర్తిలో ప్రజలు తరిమికొట్టిన తర్వాత ఇప్పుడు వర్ధన్నపేట మునిసిపాలిటీపై అవాకులు,

# వసంతనగర్‌పై స్వయంకృతాపరాధం.. గెలిచే సీటును చేజార్చుకునే దిశగా కాంగ్రెస్!

### మెతక నాయకత్వం.. ముదిరిన వర్గపోరు

### ఆశావాహుల పేరుతో అయోమయం.. 15 మందిని రేసులో నిలిపి గందరగోళం

### ఓ వర్గంపై కుట్రపూరిత రాజకీయాలు.. కోటరీ చేతిలో కీలుబొమ్మగా లీడర్‌షిప్

**కూకట్ పల్లి, జనవరి 27 (ప్రభాత సూర్య) :** చేతిలో ఉన్న గెలుపును చేజార్చుకోవడం ఎలా? అని ఎవరైనా అడిగితే వసంతనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీని చూపిస్తే సరిపోతుందేమో పార్టీని బలోపేతం చేయాల్సిన నాయకత్వమే.. వర్గపోరుకు ఆజ్యం పోస్తూ, సొంత పార్టీ పునాదులను కదిలిస్తోందన్న విమర్శలు భగ్గుమంటున్నాయి. నియోజకవర్గంలో ఎమ్మెల్యే లేకపోయినా పార్టీకి బలమైన క్యాడర్ ఉంది. కానీ, ఆ బలాన్ని వాడుకోవడంలో నాయకత్వం ఘోరంగా విఫలమవుతోందని, 'మెతక వైఖరి'తో గెలిచే సీటును కూడా ప్రత్యర్థులకు బంగారు పళ్ళెంలో పెట్టి ఇచ్చేలా వ్యవహరిస్తోందని ద్వితీయ శ్రేణి నాయకులు మండిపడుతున్నారు. సాధారణంగా ఏ డివిజన్?లోనైనా ఇద్దరు లేదా ముగ్గురు ఆశావాహులు ఉండటం సహజం. వసంతనగర్‌లో ఏకంగా 15 మందిని రేసులో నిలబెట్టడం నాయకత్వ అవివేకానికి నిదర్శనమని విశ్లేషకులు అంటున్నారు. ఆశే లేని వారికి కూడా ఆశలు కల్పించి, ఒకరిపై ఒకరిని ఉసిగొల్పుతున్నారు. దీనివల్ల పార్టీ కోసం నిజంగా కష్టపడే సీనియర్లు, కార్యకర్తలు పక్కకు తప్పుకునే ప్రమాదం ఏర్పడింది. ఇంతమందిని తయారు చేయడం బలం కాదు.. బలహీనత అని క్యాడర్ ఆవేదన వ్యక్తం చేస్తోంది. కార్యక్రమాల పేరుతో కక్ష సాధింపు పార్టీ కార్యక్రమాలు ఐక్యతను పెంచాలి.. కానీ ఇక్కడ చిచ్చు రేపుతున్నాయి. ఒక నాయకుడి ఏరియాలో కార్యక్రమం పెడుతూ.. కనీసం ఆ నాయకుడికి సమాచారం ఇవ్వకపోవడం, వారిని పిలవకపోవడం ఏ తరహా రాజకీయమని ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఒక వర్గం కార్యక్రమం చేస్తే, మరో వర్గం బహిష్కరించడం, లేదా వెళ్లిపోవడం




నిత్యకృత్యమైంది. ఇది పార్టీలో సమన్వయ లోపానికి, నాయకత్వపు రాజకీయ అపరిపక్వతకు నిదర్శనంగా నిలుస్తోంది. వసంతనగర్‌లో టికెట్ ఓసీ, బీసీ, ఎస్సీ అన్న చర్చ పక్కనపెడితే.. ఓసీ సామాజిక వర్గానికి చెందిన ఒక బలమైన నాయకుడిని టార్గెట్ చేస్తూ కుట్రలు జరుగుతున్నాయన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఆ వ్యక్తి ఎక్కడ ఎదుగుతాడోనన్న భయంతోనే.. ఉద్దేశపూర్వకంగా ఆశావాహుల సంఖ్యను పెంచుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వ్యక్తిగత ద్వేషాలతో పార్టీని బలిచేయడం ఎంతవరకు సమంజసమని కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.

**కోటరీ చేతిలో బందీనా?**

అసలు పార్టీని నడిపిస్తున్నది ఎవరు? నాయకత్వమా.. లేక చుట్టూ ఉన్న కోటరీనా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వ్యక్తిగత సమీకరణాలకు, కోటరీ మాటలకు ప్రాధాన్యమిస్తూ.. క్షేత్రస్థాయి వాస్తవాలను నాయకత్వం విస్మరిస్తోందన్న వాదన ఉంది. అనుభవలేమి, దూరదృష్టి లేని నిర్ణయాల వల్ల ప్రత్యర్థి



పార్టీలకు అనవసరమైన అవకాశం ఇచ్చినట్లవుతోందని సీనియర్లు తలలు పట్టుకుంటున్నారు.

**ఇప్పటికైనా కళ్లు తెరిచేనా?**

టికెట్ రేపు ఎవరికిచ్చినా.. ఈ రోజు నాటిన విషపు విత్తనాలు రేపు చెట్టయి గెలుపును అడ్డుకోవడం ఖాయం. ఇప్పటికైనా అధిష్టానం జోక్యం చేసుకుని, ఈ 'మెతక' నాయకత్వానికి చురకలు అంటించకపోతే.. వసంతనగర్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం కలేనని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ప్రజల సమస్యలపై పోరాడాల్సిన సమయంలో, సొంత పార్టీ నేతలపైనే యుద్ధం చేయడం నాయకత్వ దివాలాకోరుతనానికి నిదర్శనం.

# చట్ట ఉల్లంఘన తగదు

### ఆతిథ్య ఉపన్యాసంలో స్పష్టీకరించిన డాక్టర్ అర్షియా సేథి





**పటాన్చెరు జనవరి 27 ప్రభాత సూర్య:** మండలం లోని చట్టాలను మనం గౌరవిస్తే, అవి మనకు చట్టపరమైన రక్షణలను కల్పిస్తాయని, చట్ట ఉల్లంఘన తగదని ఫుల్ బ్రైట్ ఫెలో (రెండుసార్లు), విద్యావేత్త, కేఆర్ఐ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, అన్ మ్యూట్ సహ వ్యవస్థాపకురాలు డాక్టర్ అర్షియా సేథి స్పష్టీకరించారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని లలిత, ప్రదర్శన కళలు విభాగం ఆధ్వర్యంలో 'మౌనాన్ని వీడడం: నేటి భారతదేశంలో కళలు, చట్టం' అనే అంశంపై ఆమె మంగళవారం ఆతిథ్య ఉపన్యాసం చేశారు. డాక్టర్ సేథీ మేధో సంపత్తి హక్కుల (ఐపీఆర్) గురించి సమగ్రమైన అవలోకనాన్ని అందించారు. ముఖ్యంగా సాహిత్య, సంగీత రచనలలో కాపీరైట్, భౌగోళిక సూచనలు (జీఐ), సంబంధిత మినహాయింపులపై దృష్టి సారించి, అనేక చారిత్రాత్మక న్యాయ కేసుల ద్వారా తన వాదనలను వినిపించారు. ఐపీఆర్ అనేవి పారిశ్రామిక, శాస్త్రీయ, సాహిత్య, కళా రంగాలలో మేధో కార్యకలాపాల నుంచి ఉత్పన్నమయ్యే సృజనలను రక్షించే చట్టపరమైన హక్కులని ఆమె వివరించారు. ఉద్యోగ కల్పన, ఆదాయ సృష్టి, ఆర్థిక వృద్ధిలో వాటి కీలక పాత్రను ఆమె విశదీకరించారు.డాక్టర్ సేథీ కాపీరైట్, ట్రేడ్ మార్కులు, సాహిత్య దొంగతనం, పైరసీ వంటి మేధో సంపత్తి హక్కుల ముఖ్య రూపాలను వివరించారు. అలాగే, ప్రింట్, కొత్త మీడియా, కళలు, ప్రసార మాధ్యమాలు, చలనచిత్రాలు, నాటక కళలు, సంగీతం వంటి రంగాలను స్పృజిస్తూ, 1957 కాపీరైట్ చట్టం, దాని 2012 సవరణల గురించి చెప్పారు. కాపీరైట్ ను 'హక్కుల సమూహం'గా ఆమె అభిర్ణించారు. ప్రచురించిన, ప్రచురించని అసలైన రచనలకు ఇది వర్తిస్తుందని, ఇందులో సానుకూల, ప్రతికూల హక్కులుంటాయని చెప్పారు. కష్టం, సృజనాత్మకత సూత్రాలతో పాటు వాస్తవికత యొక్క పరీక్షలను ఆమె వివరించారు.కళా సంప్రదాయాలలో గురువుల హక్కులను, రచనలు గౌరవం పొందుతున్నప్పటికీ, ఏ వ్యక్తి కూడా ఒక కళారూపంపై గుత్తాధిపత్యాన్ని హక్కును కోరలేరని డాక్టర్ సేథీ స్పష్టీకరించారు. కాపీరైట్ కు మినహాయింపులను వివరిస్తూ, కళాకారుల నైతిక హక్కులు, క్రియేటివ్ కామన్స్, సక్రమ వినియోగం, కాపీరైట్ గడువు తీరిపోవడం వంటి అంశాలను డాక్టర్ సేథీ చర్చించారు.తొలుత, కార్యక్రమ సమన్వయకర్త వైష్ణవి అతిథిని స్వాగతించి, సభికులకు పరిచయం చేశారు. లలిత, ప్రదర్శన కళల విభాగానికి చెందిన డాక్టర్ లలిత సింధూరి, డాక్టర్ ఆదిశేషయ్య అతిథిని జ్ఞాపికతో సత్కరించారు.

## ఒక లక్ష రూపాయల విలువైన ఎల్ఓసిని అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్చెరు జనవరి 27 ప్రభాత సూర్య: :** ఆపత్కాలంలో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. జిన్నారం మున్సిపల్ పరిధిలోని వావిలాల గ్రామానికి చెందిన అరేళ్ల శంకర్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం స్థానిక శాసనసభ్యులు జిఎంఆర్ ద్వారా ఎల్ ఓ సి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన లక్ష రూపాయల విలువైన ఎల్ఓసిని మంగళవారం సాయంత్రం పటాన్చెరు లోని తన కార్యాలయంలో శంకర్ కుటుంబ సభ్యులకు అందచేశారు ఈ కార్యక్రమం లో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.







# దివ్యాంగుల సంక్షేమానికి 100 కోట్లు ఖర్చు చేశాం

**రాష్ట్ర డిప్యూటీ సీఎం మంత్రి భట్టి విక్రమార్క మల్లులి**

**దివ్యాంగులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం**

**దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంది - తెలంగాణ వికలాంగుల సహకార కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య**

**మధిర నియోజకవర్గ పరిధిలో దివ్యాంగులకు రిట్రోఫిటెడ్ మోటారు వాహనాల పంపిణీ చేసిన డిప్యూటీ సీఎం**

**ఖమ్మం ( సూర్య ప్రతినిధి ):** దివ్యాంగుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని గత ప్రభుత్వం పదేళ్ళలో చేయలేని పనులని ఈ ప్రభుత్వం రెండేళ్లలోనే చేసిందని అందులో భాగంగానే ఈ రెండేళ్లలో దివ్యాంగుల కోసం 100 కోట్ల రూపాయలని ప్రభుత్వం ఖర్చు చేసిందని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం మధిర నియోజకవర్గ కేంద్రంలో జిల్లా మహిళా శిశు దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో డిప్యూటీ సీఎం, తెలంగాణ వికలాంగుల సహకార కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి లతో కలిసి దివ్యాంగులకు రిట్రోఫిటెడ్ మోటారు వాహనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ చదువుకుంటున్న దివ్యాంగులకు ఐపాడ్లు కంప్యూటర్లు ట్యాబ్స్ ప్రజా ప్రభుత్వం అందిస్తోందన్నారు. తమది ప్రజల గురించి ఆలోచన చేసేటువంటి ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వమని అన్నారు. దివ్యాంగులకు ఎటువంటి సమస్యలు రాకుండా చూస్తామని వారికి అవసరమైన అన్ని సంక్షేమ పథకాలను ప్రజా ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. దురదృష్టవశాత్తు అంగవైకల్యంతో పుట్టిన వారిని కూడా సమాజంలో మనతో పాటు ముందుకు నడిపించాల్సిన బాధ్యత మనందరి పైన ఉంది దివ్యాంగుల గురించి సమాజంలో ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని అన్నారు. దివ్యాంగులు కూడా అన్ని రంగాలలో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. సమాజంలో ఇతరులు కన్నా ఎక్కువ అవకాశాలను ఆసరాను దివ్యాంగులకు మనం అందించాలని అన్నారు. అంగవైకల్యంతో ఉన్నామన్న బాధ వారికి రాకుండా వారిని ప్రోత్సహించి ముందుకు తీసుకువెళ్లాలని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఈ ఆలోచన దిశగానే ముందుకు సాగుతోందని అన్నారు. తెలంగాణ వికలాంగుల సహకార కార్పొరేషన్ చైర్మన్ శ్రీ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమం కోసం మన ప్రజా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తుందని, ఉన్నత విద్య అభ్యసించే వారికి 5% రిజర్వేషన్ అందిస్తుందని, GO 34 ద్వారా దివ్యాంగ ఉద్యోగస్థులకు ఎక్కడ ఉద్యోగం చేస్తే అక్కడే ప్రమోషన్ ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసిందని, 100 కోట్లు బడ్జెట్ కేటాయించి రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు మంజూరు చేసిందని, దానిలో మన గౌరవ ఉప ముఖ్యమంత్రి గారి సహాయ సహకారాలు చాలా ఉన్నాయని కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, జిల్లా సంక్షేమ అధికారిణి వేల్పుల విజేత, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహారావు, స్థానిక సీడీపీఓ బాల త్రిపుర సుందరి, ఐసిడిఎస్ కార్యాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఓసి జాక్ ఈ డబ్ల్యు సి శేరిలింగంపల్లి అధ్యక్షులుగా

# బోయినపల్లి వినోద్ రావు నియామకం..

**నియోజకవర్గంలోని అగ్రకుల నిరుపేదల అభ్యున్నతే లక్ష్యంగా కార్యాచరణ..**

**ఫిబ్రవరి 23 ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా విజయవంతం చేయాలని పిలుపు ..**

**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** ఓసి-జేఏసీ-ఈడబ్ల్యుసి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, శేరిలింగంపల్లి అధ్యక్షులుగా బోయినపల్లి వినోద్ రావు నియమితులయ్యారు. మదినగూడ లోని వారి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఓసి జేఏసీ జాతీయ చైర్మన్ నల్ల సంజీవరెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు గోపు జైపాల్ రెడ్డి లు వినోద్ రావుకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నల్ల సంజీవ రెడ్డి మాట్లాడుతూ.. అగ్రకులాల్లోని నిరుపేదల అభ్యున్నతే లక్ష్యంగా ఓయూ జేఏసీ ఏర్పడిందని అన్నారు. ఇటీవల జరిగిన వరంగల్ సింహగర్జనను భారీ విజయవంతం చేసిన ఓసిలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అగ్రకుల సంఘాల నాయకులందరూ ఏకమై ఓసీల్లోని నిరుపేదల హక్కులే లక్ష్యంగా ముందుకు సాగాలని అన్నారు. ఈ క్రమంలోనే శేరిలింగంపల్లిలోని అన్ని వర్గాల వారితో మంచి సత్సంబంధాలు కలిగిన వినోద్ రావుని ఓసి జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అదేవిధంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షులుగా నిర్ణయించడం కావాలి జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా వినోద్ రావు మాట్లాడుతూ.. 1986 నుంచి తాను రాజకీయాల్లో కొనసాగుతున్నానని ఎన్ ఎస్ యు ఐ కరీంనగర్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పనిచేశానని అన్నారు. హైదరాబాద్ కి వచ్చాక తన మిత్రుడు ప్రస్తుత కార్పొరేటర్ నాగేందర్ యాదవ్ ద్వారా మాజీ ఎమ్మెల్యే బిక్షపతి యాదవ్ కు దగ్గర అయ్యానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ప్రధాన కార్యదర్శిగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేశానని తెలిపారు. 2002లో శేరిలింగంపల్లి సేవాదళ్ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహిస్తూ వై ఎస్ ఆర్ పాదయాత్రలో కీలకపాత్ర పోషించిన నేపథ్యంలో నాటి మంత్రి సబితా ఇంద్రా రెడ్డి రంగారెడ్డి జిల్లా సేవాదళ్ చైర్మన్ గా బాధ్యతలు అప్పగించారని, ఆ తర్వాత గ్రేటర్ సేవాదళ్



చైర్మన్ గా సేవలందించాలని తెలిపారు. అదేవిధంగా మదినగూడ గ్రామంలో హనుమాన్ దేవాలయం చైర్మన్ గా ఆలయ పునర్నిర్మాణం లో కీలక భూమిక పోషించానని అన్నారు. ఈ క్రమంలోనే నా పనితీరును గుర్తించి ఓసీ జేఏసీ ఈడబ్ల్యుఎస్ జాతీయ, రాష్ట్ర నాయకత్వం నన్ను రాష్ట్ర కమిటీ లో ఉపాధ్యక్షుడిగా తీసుకొని శేరిలింగంపల్లి అధ్యక్ష బాధ్యతలను అప్పగించారని అన్నారు. నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, నియోజకవర్గంలో ఉన్న ఓసి కులాల్లోని నిరుపేదల అభ్యున్నతి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. ఓసీలలో 10% మాత్రమే ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెంది ఉన్నారని మిగిలిన 90 శాతం మంది రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. రిజర్వేషన్ల కారణంగా అగ్రకులాల్లోని నిరుపేద విద్యార్థులు చాలా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య వైద్య ఆర్థిక సామాజిక రంగాలలో వెనుకబడిన ఓసి వర్గాల్లోని ప్రతి ఒక్కరిని కలుపుకొని వారి హక్కుల కోసం పోరాడేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ క్రమంలోనే ఫిబ్రవరి 23న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ఓ సి జె ఎస్ సి మహా ధర్నాను విజయవంతం చేయాలని శేరిలింగంపల్లి అగ్రకుల నిరుపేదలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓసి జెఏసి రాష్ట్ర కార్యదర్శులు కొడాలి శ్రీధర్, శేరి అంతిరెడ్డి, విద్యాసాగర్ సభ్యులు దండమూరి ప్రసాద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## శెట్టిపల్లి గ్రామంలో ఘనంగా క్రికెట్ ప్రీమియర్ లీగ్.. బుల్ టీం విజేత

**( సూర్య ప్రతినిధి ) ఆమనగల్ :** రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం శెట్టిపల్లి గ్రామంలో శ్రీ అలివేలు మంగ సమేత వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవ సందర్భంగా నిర్వహించిన క్రీడా ఉత్సవాలు గ్రామానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ ప్రీమియర్ లీగ్‌లో బుల్ టీం అద్భుతమైన ఆటతీరుతో ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. మొత్తం 8 మ్యాచ్?లుగా కొనసాగిన ఈ ప్రీమియర్ లీగ్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. గ్రామ యువతతో పాటు ప్రేక్షకులను ఉత్సాహపరిచేలా మ్యాచ్‌లు జరిగాయి. ముఖ్యంగా ప్రణయ్ తన బౌలింగ్‌లో అద్భుత ప్రతిభను ప్రదర్శించి జట్టును విజయపథంలో నడిపించాడు. ఈ క్రీడా ఉత్సవాలకు భవ్య శ్రీ మోటార్స్ అధినేత చిక్కుడు లక్ష్మణ్ స్పాన్సర్‌గా నిలిచి యువతను ప్రోత్సహించారు. క్రీడల పట్ల యువత ఆకర్షితులై ఆరోగ్యకరమైన పోటీ భావంతో ముందుకు సాగాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. విజేతలైన బుల్ టీంకు ప్రథమ బహుమతిగా వచ్చిన నగదును గ్రామ అభివృద్ధి నిమిత్తం, ముఖ్యంగా గ్రామ పాఠశాల అభివృద్ధి కోసం విరాళంగా అందజేయడం గ్రామస్థుల మనసులను దోచుకుంది. మొత్తంగా శెట్టిపల్లి గ్రామంలో నిర్వహించిన ఈ క్రికెట్ ప్రీమియర్ లీగ్ క్రీడా స్ఫూర్తిని, సామాజిక బాధ్యతను కలగలిపిన ఆదర్శ కార్యక్రమంగా నిలిచింది.

## వేతన సవరణ, ఐదురోజుల పనిదినాలు

**బ్యాంక్ ఉద్యోగుల సమ్మెతో స్తంభించిన బ్యాంకు కార్యకలాపాలు**

న్యూఢిల్లీ,: ఐదురోజుల పనిదినాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దేశంలోని ప్రభుత్వరంగ బ్యాంకు ఉద్యోగులు మంఘలవారందేశవ్యాప్తంగా సమ్మెకు దిగారు. ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్, బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వంటి ఉద్యోగ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈ సమ్మె చేపట్టారు. దీంతో బ్యాంకులు మంగళవారం మూతపడ్డాయి. . చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ ముఖ్యమైన డిమాండ్లు నెరవేర్చాలని బ్యాంకు ఉద్యోగుల సంఘాలు ఈ సమ్మెకు దిగాయి. బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లలో ప్రధానంగా.. వారానికి ఐదు రోజుల పని దినాలు, వేతనాల పెంపు, పెన్షన్ సంస్కరణలు, 12వ ద్వైపాక్షిక వేతన ఒప్పందం పూర్తిగా అమలు కావాలన్నవి ఉన్నాయి. అంతేకాదు, ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణకు నిరసన, ఆటోమేషన్, ఔట్‌సోర్సింగ్ వల్ల ఉద్యోగాలపై వస్తున్న ముప్పు, పని ఒత్తిడి తగ్గించాలని, మెరుగైన వర్కింగ్ కండిషన్స్ ఉండాలని, సిబ్బంది కొరత తీర్చాలని, పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ లేదా మెరుగైన పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వాలని బ్యాంకు ఉద్యోగులు కోరుతున్నారు. ఈ డిమాండ్లపై జరిపిన చర్చలు ఫలించకపోవడంతో ఒక రోజు దేశవ్యాప్త సమ్మెకు దిగారు. సమ్మె కారణంగా దేశంలోని దాదాపు అన్ని పబ్లిక్ సెక్టర్ బ్యాంకుల శాఖలు మూసివేశారు. దీంతో బ్యాంకు ఖాతా దార్లకు పరిమిత సేవలు మాత్రమే ఇవాళ అందుబాటులో ఉన్నాయి. ఫలితంగా దేశ వ్యాప్తంగా బ్యాంకు ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వ్యాపారులు, పెన్షనర్లు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

## ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో తనిఖీలు

**50వేలకు మించి నగదు ఉంటే రషీదు ఉండాలి**

**ఏడీజీ మహేష్ భగవత్ వెల్లడి**

హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తక్షణమే రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. అక్రమాలను అరికట్టేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్లు రంగంలోకి దిగాయని ఏడీజీ మహేష్ భగవత్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నగదు రవాణాపై పోలీసులు కఠిన నిబంధనలు విధించారు.. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో వ్యక్తులు గరిష్టంగా 50,000 వరకు మాత్రమే నగదును వెంట తీసుకెళ్లాలి. రూ. 50,000 కంటే ఎక్కువ నగదు ఉంటే తప్పనిసరిగా సరైన ఆధారాలు చూపించాలి, లేని పక్షంలో ఆ నగదును సీజ్ చేస్తారు. పోలీసులు నగదు లేదా ఇతర వస్తువులను సీజ్ చేసినప్పుడు తప్పనిసరిగా రిసీట్ ఇస్తారు. దానిపైనే అప్పీల్ చేసుకునే వివరాలు కూడా ఉంటాయి. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ భారీ ఏర్పాట్లు చేస్తోంది. తెలంగాణ పోలీసులతో పాటు ఫారెస్ట్ , ఎక్సైజ్ శాఖల నుంచి సుమారు 2,000 మంది అదనపు సిబ్బందిని వినియోగిస్తున్నారు. పారదర్శకత కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో 100శాతంవెబ్ కాస్టింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. హైపర్ సెన్సిటివ్ , క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలతో నిఘా ఉంచుతారు. రౌడీ షీటర్లను బైండోవర్ చేసే పక్రియ ప్రారంభమైంది. ఓటర్లందరూ ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా, నిర్భయంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల కమిషన్ , పోలీస్ శాఖ విజ్ఞప్తి చేశాయి.



# మేడారం కోసం మీడియా ఉత్సాహం

### దేశవిదేశాల నుంచి ఫోటోగ్రాఫర్లు, విలేకర్లు రాక

ములుగు: మేడారం జాతరలో మీడియా మేనేజ్‌మెంట్ అనేది అత్యంత ప్రధానమైనది, కీలకమైనది, సంక్లిష్టమైనది. అయితే సాంకేతికత పెరిగిన కారణంగా మీడియా కవరేజ్ చాలా సులువుగా మారింది. ఒక్క సెల్‌ఫోన్‌తో ప్రపంచ వ్యాప్తంగా సమాచారన్ని చేరవేసే అవకాశం రావడంతో జాతరలో ప్రత్యేకతలను విలేకరులు ఎప్పటికప్పుడు తమ కార్యాలయాలకు చేరవేస్తుంటారు. ఇంకా చెప్పాలంటే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకర్లు పోటీపడి జాతరను కవర్ చేయడం చూస్తున్నాం. ఈ జాతర జరిగే నాలుగు ర ఓజులే కాకుండా నెల ముందునుంచి తరవాత ఓ పక్షం రోజుల వరకు నిరంతరం ప్రతి సూక్ష్మ అంశాన్ని ప్రజలకు తెలియజేస్తుంటారు. ఈ జాతర కవరేజీకి డీపీఆర్వో కార్యాలయం నుంచే దాదాపు వెయ్యి మీడియా పాస్‌లు జారీచేయడం, దానికితోడు మరో రెండు వందలకు పైగా దేశ, విదేశీ జర్నలిస్టులు కవరేజీ చేసేందుకు చేస్తారు. జాతరపై అధ్యయనం చేసేందుకు, జాతర అంశాలను తమ కెమెరాల్లో బంధించేందుకు ఎంతోమంది ఫోటోగ్రాఫర్లు కూడా వస్తారు. గిరిజన సంస్కృతీ, సాంప్రదాయాలు, మొక్కులు, జాతర జరిగే తీరు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే గిరిజన జాతుల సంస్కృతీ సంప్రదాయాలను తమ కథనాలతో పాటు, ఫోటోల ద్వారా అందించేందుకు ఉత్సాహం చూపుతారు.

## మహాజాతరకు ఆర్టీసీ విస్తృతంగా ఏర్పాట్లు

### భక్తుల కోసం 4వేల ప్రత్యేక బస్సుల కేటాయింపు

**ములుగు,(ప్రభాత సూర్య) :** మేడారం మహాజాతరకు ఆర్టీసీ విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. జాతరకు రాష్ట్ర నలుమూలల నుంచి 20 లక్షల మంది భక్తులను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుంది. 4వేల ఆర్టీసీ బస్సులను సిద్ధం చేసింది. 10,441 మంది సిబ్బందిని నియమించి సేవలను విస్తృత పరిచేందుకు ఏర్పాట్లు చేసింది. వరంగల్ రీజియన్‌లో 51 పాయింట్లను ఏర్పాటు చేసింది. హన్మకొండలో హయగ్రీవచారి మైదానం, వరంగల్‌లో పండ్ల మార్కెట్‌లో మేడారం బస్సు పాయింట్స్‌ను ఏర్పాటు చేసింది. అలాగే జాతరకు వెళ్లలేని భక్తుల కోసం ఆర్టీసీ వినూత్న తరహాలో కొత్త స్కీం ప్రవేశ పెట్టింది. 30మంది భక్తులు ఉంటే ఇంటికే ఆర్టీసీ బస్సును పంపిస్తుంది. ఇప్పటికే మేడారం ప్రసాదాన్ని(బెల్లం) భక్తులకు ఇంటికి చేర్చేందుకు ప్రత్యేకంగా కార్గో సర్వీసు ప్రారంభించింది. అలాగే బస్సు సౌకర్యాలు, చార్జీలు, రూట్ మ్యాప్ తదితర వివరాల కోసం ప్రత్యేకంగా మేడారం విత్ ఆర్టీసీ పేరుతో ఓ యాప్‌ను రూపొందించింది. గత జాతరలో 3491 బస్సుల ద్వారా 16.82 లక్షల మంది ప్రయాణికులను చేరవేయగా, ప్రస్తుతం 20లక్షల మంది భక్తులను తరలించనున్నారు. వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలతో పాటు హైదరాబాద్ రీజియన్ నుంచి బస్సులను కేటాయించారు. మేడారంలో 50 ఎకరాల్లో తాత్కాలిక బస్టాండ్‌ను ఏర్పాటు చేసి 9 కిలోమీటర్ల పొడవుతో 50క్యూలను ఏర్పాటు చేశారు. ఇందులో ఒకేసారి 20వేల మంది భక్తులకు వసతి కల్పించనున్నారు. ప్రయాణికుల నిరీక్షణ, సిబ్బంది విశ్రాంతి గదులు, నిర్వహణ కార్యకలాపాల కోసం 1.10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేశారు. వెయ్యి బస్సుల పార్కింగ్ కోసం మేడారంతో పాటు కామారంలో సౌకర్యాలు కల్పించారు. 7వేల మంది డ్రైవర్లు, 1811 మంది కండక్టర్లు, 759 మంది భద్రతా సిబ్బం ది, 153 మంది అధికారులతో కలిసి మొత్తం 10,441 మంది ఉద్యోగులకు విధులు కేటాయించారు. ట్రాఫిక్ జామ్ లాంటి సమస్యలు ఏర్పడకుండా పెట్రోలింగ్ పార్టీని సైతం నియమించారు.

## జాతరలో మంచినీటి వసతి

### 5,500 తాత్కాలిక నల్లాలు ఏర్పాటు

**ములుగు,(ప్రభాత సూర్య) :**మేడారంలో భక్తుల కోసం గ్రామీణ నీటిపారుదల శాఖ, మిషన్ భగీరథ ద్వారా రూ.13.70కోట్ల వ్యయంతో 57రకాల పనులను చేపట్టారు. జాతరలో 5,500 తాత్కాలిక నల్లాలు ఏర్పాటు చేశారు. వీటిలో 517 బ్యాటరీ ఆఫ్ టాప్స్, 47సిస్టెర్న్స్, 312 సిస్టర్న్ టాప్స్, 10 చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. 2024లో 5,222 నల్లాలు ఏర్పాటు చేయగా, ఈసారి 5,500నల్లాలను ఏర్పాటు చేశారు. మేడారం ప్రధాన రహదారి, ఆలయం పరిసరా ప్రాంతాలు, పార్కింగ్ ప్రాంతాలు, వివిధ గ్రామాల నుంచి వచ్చే రహదారులు, చెరువులు, జంపన్నవాగు సమీపంలో మరుగుదొడ్లతో పాటు తాగునీటి సౌకర్యాలు కల్పించారు. జాతరలో మొత్తం 5,700టాయిలెట్లు నిర్మించారు. 285 బ్లాకులుగా ఏర్పాటు చేశారు. వీటిని నిరంతరం శుభ్రం చేసేందుకు 255మంది సిబ్బందిని నియమించారు. అలాగే జాతరలో పారిశుద్ధం కార్యక్రమాల కోసం 5వేల మంది శానిటేషన్ సిబ్బందిని నియమించారు. రోజుకు మూడు షిప్టులుగా విభజించి 25సెక్టార్‌లలో పని చేయనున్నారు.

# మున్సిపల్ ఎన్నికల హడావిడి

### పనిలోపనిగా అక్రమార్కుల ఇసుకదోపిడీ

### అధికారులు పట్టించుకోవడంలేదంటున్న ప్రజలు

**నిజామాబాద్,(ప్రభాత సూర్య) :** భీమ్‌గల్ మండలంలో ఇసుక దందాకు అడ్డూ అదుపులేకుండా ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. విడుతల వారీగా అడ్డాలు మారుస్తూ ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. వీరికి నాయకులు, అధికార యంత్రాంగం ఉన్నట్లు తెలుస్తోంది.ఈ విషయమై గ్రామంలో కొందరు డయల్ 100 నంబర్‌కు ఫిర్యాదు చేయగా, పోలీసులు వచ్చి పరిశీలించి వెళ్లిపోయారు. మున్సిపల్ ఎన్నికల హడావుడిలో పార్టీలు, నాయకులు ఉండగా అక్రమార్కులు రహస్యంగా ఇసుకను తరలించడం చేస్తున్నారు. ఒక రోజు గ్యాప్ ఇచ్చి తిరిగి రాత్రి ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అయినా అధికారులు తమకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరించడం గమనార్హం. ఇటీవల గ్రామంలో ఉన్న కప్పల వాగు నుంచి ఇసుక తవ్వకాలకు అక్రమార్కులు స్థానిక గ్రామ కమిటీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒప్పందం ప్రకారం మూడు రోజుల క్రితం అర్ధరాత్రి పెద్ద సంఖ్యలో ట్రాక్టర్లతో వాగులోకి ప్రవేశించి ఇసుకను గ్రామ శివారులోని హైస్కూల్ పక్కన డంపు చేశారు. అక్కడి నుంచి లారీలు, టారస్ బండ్లలో పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు.అర్ధరాత్రి వేళ అందినకాడికి దోచుకుపోతున్నారు. అధికారంలోకి వచ్చిందే ఆలస్యం మండలంలోని కప్పలవాగుపై నాయకులు దండయాత్ర చేస్తున్నారు. మండలంలో ఇసుక లభించే ప్రాంతాలు కనిపిస్తే చాలు తవ్వుకుంటున్నారు. మొన్నటి వరకు బడాభీమ్‌గల్, తర్వాత భీమ్‌గల్, అనంతరం సికింద్రాపూర్, తాజాగా బెజ్జోరా వాగులో ఇసుక తవ్వకాలు చేపట్టిన అక్రమార్కులు ఇప్పుడు మండలంలోని గోన్‌గొప్పుల్ వాగులోకి ప్రవేశించారు. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నీటి నిల్వలు తగ్గుతాయని అంటున్నారు. తంలో రెండు మూడు రోజులు పెద్ద మొత్తంలో ఇసుకను డంపులు చేసి ఒకేసారి లారీలు, టారస్ బండ్లలో పట్టణ ప్రాంతాలకు తరలించేవారు. భారీ ఇసుక డంపులతో ప్రజల కండ్లలోకి వస్తున్నామని భావించిన ఇసుకాసురులు, ఈ సారి కొత్త ఎత్తుగడ వేశారు. ముందుగానే నిర్ణయించిన స్థలంలో టారస్ బండ్లు, లారీలు సిద్ధంగా ఉంచి, వచ్చిన ఇసుకను వచ్చినట్లు జేసీబీ సాయంతో భారీ వాహనాల్లో నింపుతున్నారు. దీంతో తెల్లవారే సరికి ఖాళీ మైదానం దర్శనమిస్తుంది. ఎవరైనా దాడులు, తనిఖీలు చేసినా అక్కడ ఏమీ కనిపించకుండా ముందు జాగ్రత్త పడుతున్నారు. నియోజకవర్గ స్థాయిలో నాయకుల మద్దతుతోనే ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. గ్రామాలకు ఆదాయం ఆశ చూపించి, వీడీసీల పేరుతో గ్రామస్తుల

# మోగిన నగారా!

(మొదటి పేజీ తరువాయి)

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243, తెలంగాణ మునిసిపాలిటీల చట్టం 2019 ప్రకారం ఈ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ఈ ఎన్నికల్లో మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మహిళా ఓటర్లు 26.80 లక్షలు, పురుష ఓటర్లు 25.62 లక్షలు, ఇతరులు 640 మంది ఉన్నారు.

**ఎన్నికల షెడ్యూల్ ఇలా!**

అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో బుధవారమే కమిషనర్లు నోటిఫికేషన్ జారీ చేసి, నామినేషన్ల స్వీకరణ ప్రారంభిస్తారు. 30వ తేదీ వరకు వరకు ప్రతిరోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. బుధవారమే అన్ని వార్డుల పరిధిలో ఓటర్ల జాబితాను కూడా ప్రదర్శిస్తారు. 31న నామినేషన్లను పరిశీలించి, అర్హులైన అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. నామినేషన్లు తిరస్కరణకు గురైన అభ్యర్థులు ఫిబ్రవరి 1న అప్పీలు చేసుకోవచ్చు. మర్నాడు వారి అప్పీళ్లను పరిష్కరించి అర్హుల జాబితాను ఖరారు చేస్తారు. ఫిబ్రవరి మూడవ తేదీ మధ్యాహ్నం మూడు గంటల లోపు పోటీ నుంచి తప్పుకోవాలనుకున్న అభ్యర్థులు నామినేషన్లనుఉపసంహరించుకోవచ్చు. అదే రోజు సాయంత్రానికి అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. ఏడు కార్పొరేషన్లు, 116 మునిసిపాలిటీల పరిధిలో ఫిబ్రవరి 11న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అవాంఛనీయ కారణాల వల్ల ఎక్కడైనా పోలింగ్ వాయిదా పడితే మర్నాడు(12వ తేదీ) పోలింగ్ నిర్వహిస్తారు. 13న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించి వెంటనేఫలితాలను వెల్లడిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా పది కార్పొరేషన్లు, 121 మునిసిపాలిటీలు ఉండగా పదవీకాలం పూర్తయిన 7 కార్పొరేషన్లు, 116మునిసి పాలిటీల పరిధిలో మాత్రమే ప్రస్తుతం ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మిగతా వాటికి పదవీకాలం పూర్తయ్యాక తర్వాత షెడ్యూల్‌లో ఎన్నికలు నిర్వహిస్తారు. ప్రస్తుతం కరీంనగర్, రామగుండం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, కొత్తగూడెం, నల్గొండ కార్పొరేషన్లలో ఎన్నికలు చేపడుతున్నారు. జీహెచ్‌ఎంసీ, గ్రేటర్ వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ల పదవీ కాలం పూర్తి కానందున వాటి గడువు ముగిసిన తర్వాత ఎన్నికలు జరుపుతారు. నకిరేకల్, సిద్దిపేట, కొత్తూరు, జడ్చర్ల, అచ్చంపేట మున్సిపాలిటీలకు కూడా తర్వాత షెడ్యూల్‌లో నిర్వహిస్తున్నారు.



**వార్డులు, రిజర్వేషన్ల కేటాయింపు ఇలా**

ఏడు కార్పొరేషన్ల పరిధిలో 414 వార్డు డివిజన్లు, 116 మునిసిపాలిటీల్లోని 2,582 వార్డులు కలిపి మొత్తం 2,996 మంది సభ్యులను ఎన్నుకోవడానికి పోలింగ్ నిర్వహించనున్నారు. అన్ రిజర్వుడ్ మహిళలకు అత్యధికంగా 864 స్థానాలు కేటాయించారు. అన్ రిజర్వుడ్‌కు 647 స్థానాలు కేటాయించారు. బీసీ జనరల్‌కు 463, బీసీ మహిళలకు 391 స్థానాలు దక్కాయి. ఎస్సీ జనరల్‌కు 254, ఎస్సీ మహిళలకు 190, ఎస్టీ జనరల్‌కు 147, ఎస్టీ మహిళలకు 40 సీట్లు కేటాయించారు.

**16న మేయర్, ఛైర్‌పర్సన్ల ప్రమాణం**

ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు పూర్తయి ఫలితాలను వెల్లడించిన తర్వాత జిల్లా కలెక్టర్లు కార్పొరేషన్లు, మున్సిపాలిటీల మేయర్లు, ఛైర్‌పర్సన్లను ఎన్నుకునేందుకు ఫిబ్రవరి 14న నోటిఫికేషన్ జారీ చేస్తారు. 16న ఉదయం 11 గంటలకు నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం చేయిస్తారు. 12:30 గంటలకు మేయర్, డిప్యూటీ మేయర్, ఛైర్‌పర్సన, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నికనిర్వహిస్తారు. ఎన్నికైన వెంటనే ప్రమాణ స్వీకారం కూడా చేయిస్తారు. అనివార్య కారణాల వల్ల 16న ఎన్నిక పూర్తి కాకపోతే మరుసటి రోజు 17న(సెలవు దినమైనప్పటికీ) ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది.

**అందరూ ఓటేయాలి: రాణి కుముదిని**

ప్రజాస్వామ్యంలో తమకు నచ్చిన వ్యక్తులను ఓటు ద్వారా ఎన్నుకునేందుకు చట్టం కల్పించిన అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనాలని రాణి కుముదిని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు రాజకీయ పార్టీ గుర్తుల ప్రాతిపదికన బ్యాలెట్ పద్ధతిలో జరుగుతాయని చెప్పారు. ఎన్నికల కోసం బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లను ఉపయోగిస్తారని అన్నారు.

అన్ని పోలింగ్ స్టేషన్లు, కౌంటింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నామినేషన్ కేంద్రాలలో కూడా రికార్డింగ్ ప్రక్రియ ఉంటుందని చెప్పారు. 8,203 కేంద్రాల్లో, 16,031 బ్యాలెట్ బాక్సులతో పోలింగ్ జరుగుతుందని తెలిపారు. 137స్ట్రాంగ్ రూమ్‌లను, 136 కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ఎన్నికల విధుల్లో 1,379 రిటర్నింగ్ అధికారులు(ఆర్‌ఓ), 1,547 మంది అదనపు రిటర్నింగ్ అధికారులు(ఏఆర్‌ఓ), 9560 మంది పోలింగ్ అధికారులు(పీఓ), 31,428 మంది అదనపు పోలింగ్ అదికారులు(ఏపీఓ) పాల్గొననున్నట్లు చెప్పారు. నిఘా కోసం 742 మంది జోనల్ అధికారులు, 279 మంది ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 381 స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలను రంగంలోకి దించినట్లు ఎస్‌ఈసీ వెల్లడించారు.

**కోడ్ అమల్లోకి: ఏడీజీ మహేశ భగవత**

రాష్ట్రంలోని 7 కార్పొరేషన్లు, 116 మునిసిపాలిటీల్లో ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణలో మంగళవారం నుంచే కోడ్ అమల్లోకి వచ్చిందని లా అండ్ ఆర్డర్ అదనపు డీజీ మహేశ భగవత తెలిపారు. ప్రజలు రూ.50 వేలకు మించి నగదు రవాణా చేయరాదని, చేయాల్సి వస్తే ఉంటే రసీదు దగ్గర పెట్టుకోవాలని సూచించారు. ఈ ఎన్నికల విధుల్లో 22 వేల మంది పోలీసులు పాల్గొంటారని చెప్పారు. 1926 సున్నితమైన, 1300, అత్యంత సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించామని తెలిపారు. మతపరంగా సున్నితమైన పోలింగ్ కేంద్రాలు నిర్మల్, భైంసా, బోధన, నిజామాబాద్‌లలో ఉన్నట్లు చెప్పారు. మేడారం జాతరకు వెళ్లే వారికి ఎన్నికల తనిఖీ నుంచి మినహాయింపు ఉంటుందని అన్నారు.

# ప్రతిపక్షాల విమర్శలను దీటుగా తిప్పికొట్టాలి

మరావతి,జనవరి27: ప్రతిపక్షాల విమర్శలను దీటుగా తిప్పికొట్టడంలో కీలకపాత్ర పోషించాలని తెదేపా పార్లమెంట్ కమిటీలతో పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అన్నారు.. గుజరాత్‌లా వరుసగా ఎన్నికల్లో గెలవడం అలవాటు చేసుకోవాలన్నారు.2004, 2009లో తెదేపా గెలిచి ఉంటే అభివృద్ధిలో రాష్ట్రం మరోలా ఉండేదని అన్నారు. 43 ఏళ్ల తెలుగుదేశం పార్టీని 48 ఏళ్ల యువగళం లీడ్ చేస్తోందని.. పార్టీలో ఉన్న ఎక్కువ మంది నేతల సగటు వయసు ఇప్పుడు 48 ఏళ్లు అని సీఎం చంద్రబాబు అన్నారు. తెదేపా పార్లమెంట్ కమిటీలతో సమావేశం సందర్భంగా సీఎం మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ప్రతీ బూత్‌లో ఓట్లు పెరగాలే కానీ తగ్గ కూడదన్నారు. అందుకు తగ్గట్లుగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాల గురించి పార్లమెంట్ అధ్యక్షులు ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ పార్టీని బలంగా తీసుకెళ్లాలి. పవిత్రమైన శ్రీవారి ప్రసాదం లడ్డూలో కల్తీ నెయ్యి కలిపారు. కుప్పానికి హంద్రీనీవా నీరు తెస్తున్నామని డ్రామాలు ఆడారు. పూర్తి చేయకుండానే వెలిగొండను జాతికి అంకితం చేశారు. తప్పుడు ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పికొట్టడం చాలా ముఖ్యం అని పార్టీ నేతలకు సూచించారు. మీడియాలోనే కాదు..మౌత్ టు మౌత్ చెప్పాలి. అప్పుడే క్లారిటీ వస్తుందని నేతలకు దిశానిర్దేశర చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పార్లమెంట్ కమిటీల వర్క్‌షాప్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ సమావేశంలో పార్టీని మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లే దిశగా పార్టీ కేడర్‌కు ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు దిశానిర్దేశర చేశారు. పార్టీ రోజురోజుకూ మరింత సమర్థవంతంగా పని చేసేలా బలోపేతం కావాలని పేర్కొన్నారు. అందుకే పార్టీలో యువతకు కీలక బాధ్యతలు అప్పగించామని చెప్పారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో 80 శాతం మంది కొత్త వారికి, విద్యావంతులకు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చామని గుర్తు చేశారు. దేశంలోనే యువ పార్లమెంట్ కలిగిన పార్టీగా టీడీపీ నిలిచిందని వ్యాఖ్యానించారు. సమర్థులకే పెద్దపీట వేసినట్టు వెల్లడించిన సీఎం, అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించామని తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గాల్లో జరిగే పార్టీ కార్యక్రమాలకు అధ్యక్షులు, సెక్రటరీలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎవరు కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారో నివేదికలు తెప్పిస్తామని స్పష్టం చేశారు. పొలిటికల్ గవర్నెన్స్‌లో పార్లమెంట్ కమిటీల పాత్ర కీలకమని చంద్రబాబు తెలిపారు. పార్లమెంట్ పరిధిలో చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, పార్లమెంట్ అధ్యక్షులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీలో పదవులు ఇచ్చేటప్పుడు కార్యకర్తల అభిప్రాయాన్ని తప్పనిసరిగా పరిగణలోకి తీసుకుంటున్నామని తెలిపారు. జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించిన చంద్రబాబు.. 2024 ఎన్నికల్లో కూటమికి వచ్చిన ఓట్ల కంటే కనీసం పది శాతం అదనంగా సాధించాలనే లక్ష్యంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో కూటమి మరింత బలపడిందని అన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ఎప్పటికప్పుడు ప్రజల మధ్య ఉండాలని చంద్రబాబు సూచించారు. పార్టీ కంటే ముఖ్యమైనది ఏదీ లేదని, నిర్లక్ష్యం వహించిన వారిని పక్కనపెడతామని హెచ్చరించారు. పార్టీ సిద్దాంతానికి కట్టుబడి పనిచేయాలని, వచ్చిన అధికారాన్ని నిలబెట్టుకోవడం నాయకత్వం, శ్రేణుల బాధ్యత అని పేర్కొన్నారు. కార్యకర్తే పార్టీకి అధినేత అని స్పష్టం చేసిన చంద్రబాబు.. ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగినప్పుడే పార్టీ శాశ్వతంగా నిలుస్తుందన్నారు.

## వాహనాల ట్రాఫిక్ అతిపెద్ద సమస్య

### విధించిన రూట్లలోనే వెళ్లేలా చర్యలు

### రోడ్డు పక్కన వాహనాల నిలుపడం నిషేదం

### వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్

వరంగల్,జనవరి27(ఆర్‌ఎన్‌ఎ):భక్తులు మేడారం జాతరకు వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టినట్లు జాతర ట్రాఫిక్ ఇన్‌ఛార్జి, వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. వాహనాలను నిరంతరంగా పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. రోడ్డు పక్కల ఎక్కడా వాహనాల పార్కింగ్‌కు వీలులేదన్నారు. వివిధ రూట్లను సిద్ధం చేశామని, ఆయా రూట్లలోనే వాహనాలు వెళ్లేలా నిబంధనలు విధించామని అన్నారు. చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తుంటామని అన్నారు. 4,500 మంది పోలీసులను నియమించినట్లు పేర్కొన్నారు. మొత్తం 18 సెక్టార్లుగా విభజించామని, సెక్టార్‌కు డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఈ నెల 28 నుంచి మేడారం మహా జాతర ప్రారంభమవుతున్న సందర్భంగా జాతర ట్రాఫిక్ ఏర్పాట్లను వివరించారు. జాతరకు వెళ్లేందుకు ఒక దారి, తిరిగి వచ్చేందుకు మరో దారిని ఏర్పాటు చేశామని అన్నారు. తిరిగి వచ్చేప్పుడు నార్లపూర్, చలివాడు, రేగొండ, పరకాల, గుడెప్పాడ్, కరీంనగర్ వెళ్లే వాహనాలు పరకాల నుంచి పోవాల్సి ఉంటుందన్నారు. వివిధ మార్గాల ద్వారా వచ్చేవారికి మేడారం పరిసర ప్రాంతాల్లోనే పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామని, సెక్టార్ల వారీగా పార్కింగ్ ఉంటుందని అన్నారు. ఒకటి నిండిన తర్వాత మరొకటి నింపుతారు. ఇలా పూర్తి స్థాయిలో వాహనాలను నిలిపిన తర్వాత ప్రత్యామ్నాయ మార్గాల్లో కూడా పార్కింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్, ఖమ్మం, మహబూబాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు ఓఆర్‌ఆర్ నుంచి దామెర మీదుగా వెళ్లాల్సి ఉంటుందని, నగరంలోకి వస్తే ఇబ్బంది పడాల్సి వస్తుందని సూచించారు. వాహనదారులు జాతీయ రహదారులపై ఎట్టి పరిస్థితుల్లో వాహనాలను నిలుపవద్దని అన్నారు. పస్రా వరకు ఒకే మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది. వీవీఐపీ, వీఐపీ పాస్‌లు ఉన్నవారికి మాత్రమే తాడ్వాయి నుంచి అనుమతి ఉంటుంది. మేడారంలో సూచించిన స్థలాల్లో మాత్రమే పార్కింగ్ చేయాల్సి ఉంటుందన్నారు.

# గ్లోబల్ సమ్మిట్‌తో రియల్ మార్కెట్ రైజింగ్

### విజన్ డాక్యుమెంట్‌లో అన్ని రంగాలకు ప్రాధాన్యం

### నివాసం, పర్యాటకం, గిడ్డంగులు, డేటా సెంటర్లలో పెట్టుబడులకు అవకాశం

### ఫ్యూచర్ సిటీ, మూసీ మాస్టర్ ప్లాన్స్ తర్వాతే పెట్టుబడులపై స్పష్టత



అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు గ్లోబల్ సమ్మిట్ రూపంలో ప్రభుత్వం తీసుకున్న చొరవ ప్రశంసనీయం. రియల్ ఎస్టేట్‌కు జీవం.. ఉపాధి.. ప్రస్తుతం తరుణంలో ఈ ప్రాథమిక అంశంపై ప్రభుత్వం దృష్టిసారించడం కీలకం. విజన్ డాక్యుమెంట్‌తో ప్రభుత్వ దీర్ఘకాల విజన్‌పై స్పష్టత ఇవ్వడంతో పెట్టుబడిదారుల్లో విశ్వాసం నెలకొంటోంది. జాయింట్ వెంచర్లు, విదేశీ పెట్టుబడి అవకాశాలు పెరుగుతాయి. కొత్త ప్రాజెక్ట్‌లు, అనుమతుల్లో వేగం, పాలసీలతో సెంటిమెంట్ బలపడుతుంది. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన విజన్ డాక్యుమెంట్‌లో తయారీ, ఐటీ, ఫార్మా వంటి రంగాలే కాదు సినిమా, క్రీడలు, సెమీ కండక్టర్లు, అంతరిక్షం, జీవ ఉత్పత్తులు, జీవ వైవిధ్యం వంటి అన్ని రంగాలతో సమగ్రంగా ఉంది. దీంతో నివాస, ఆఫీసు స్పేస్‌లోనే పర్యాటకం, క్రీడలు, గిడ్డంగులు, డేటా సెంటర్ల వంటి ఇతర రియల్టీ మాధ్యమాలలో కూడా పెట్టుబడి అవకాశాలు ఏర్పడ్డాయి.

**వెస్ట్ టు సౌత్..**

నగర రియల్టీ మార్కెట్‌లో ఇప్పటి వరకు వెస్ట్ హైదరాబాద్‌దే ఆధిపత్యం. బహుళ జాతి ఐటీ, ఆర్థిక సంస్థలు, డేటా సెంటర్లు పశ్చిమంలో కేంద్రీకృతమై ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. అలాగే ఈ ప్రాంతానికి శంషాబాద్ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్‌కు సులువైన కనెక్టివిటీతో పాటు విశాలమైన రహదారులు, మెరుగైన మురుగునీటి వ్యవస్థ, తాగునీరు, నిరంతరం విద్యుత్ వంటి మెరుగైన మౌలిక సదుపాయాలున్నాయి. దీంతో బహుళ అంతస్తుల నివాస, వాణిజ్య సముదాయాలు, అంతర్జాతీయ విద్యా, వైద్యం, వినోద సంస్థలకు డిమాండ్ ఏర్పడింది. ఫలితంగా రాయదుర్గం, కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్, గచ్చిబౌలి, మాదాపూర్ వంటి వెస్ట్ హైదరాబాద్‌లో భూములు హాట్‌కేక్‌లుగా మారాయి. ప్రభుత్వం నిర్వహించే వేలంలోనే ఎకరం రూ.వందల కోట్లు పలుకుతుందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి ఖరీదైన ప్రాంతంలో సామాన్య, మధ్యతరగతికి సొంతిల్లు కలే. ఇలాంటి సమయంలో ప్రభుత్వం కొత్త ప్రాంతానికి అభివృద్ధిని విస్తరించడం హర్షించదగిన పరిణామం. నగరానికి దక్షిణ భాగమైన శ్రీశైలం జాతీయ రహదారి, నాగార్జున సాగర్ రాష్ట్ర రహదారి మధ్యలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించాలని నిర్ణయించింది. దీంతో గ్రీన్‌ఫీల్డ్ నెట్ జీరో సిటీ పరిసర ప్రాంతాలలో మౌలిక వసతులు మెరుగవుతాయి. ఫలితంగా నివాస, వాణిజ్య సముదాయాలు వెలుస్తాయి. సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలు అందుబాటు ధరల్లోనే సొంతింటి కలను సాకారం చేసుకునే వీలు ఏర్పడుతుంది. ఏ ప్రాజెక్ట్‌కైనా బృహత్ ప్రణాళిక(మాస్టర్ ప్లాన్) కీలకం. రాష్ట్రాభివృద్ధిని మార్చే కీలక ప్రాజెక్ట్‌లలో భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవం కీలకమని పదే పదే ప్రభుత్వం చెబుతోంది. అలాంటి కీలకమైన ప్రాజెక్ట్‌లకు మాస్టర్ ప్లాన్ వస్తేనే పెట్టుబడులపై స్పష్టత వస్తుంది. డెవలపర్లు, పెట్టుబడిదారులు ఎవరికైనా సరే మాస్టర్ ప్లాన్‌లో ఏ జోన్ ఎక్కడ వస్తుంది? బహుళ వినియోగ జోన్ ఏరియా ఎంత? వంటి కీలక అంశాలను పరిగణలోకి తీసుకొనే ముందడుగు వేస్తారు.



## ప్రియం కానున్న బెంజ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 12: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ కూడా వాహన ధరలను పెంచబోతున్నట్టు ప్రకటించింది. జనవరి నుంచి అన్ని రకాల వాహన ధరలను 2 శాతం వరకు సవరిస్తున్నట్టు వెల్లడించింది. యూరోతో పోలిస్తే రూపాయి మారకం విలువ పడిపోవడంతో సంస్థపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా వాహన ధరలను పెంచాల్సివస్తున్నదని పేర్కొంది. ప్రస్తుతం రూపాయి-యూరో విలువ 100కి పడిపోయింది. ఉత్పత్తి వ్యయం పెరగడంతోపాటు లాజిస్టిక్ ఖర్చులు కూడా అధికమడం కూడా ధరల పెంపునకు ప్రధాన కారణాలని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

## ప్యాసింజర్ వాహన అమ్మకాల్లో 19% వృద్ధి

### వాహన తయారీదారుల సంఘం సియామ్ వెల్లడి



ముంబై: పండగ సీజన్ తర్వాత కూడా ప్యాసింజర్ వాహనాలకు (కార్లు, ఎస్‌యూవీలు, వ్యాన్లు) డిమాండ్ కొనసాగింది. ఈ నవంబర్‌లో కంపెనీల నుంచి డీలర్లకు మొత్తం 4,12,405 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలు సరఫరా అయ్యాయి. గతేడాది ఇదే నవంబర్‌లో సరఫరా 3,47,522తో పోలిస్తే ఇది 19% అధికంగా ఉందని భారత వాహన తయారీదారుల సంఘం సియామ్ తెలిపింది. కార్ల తయారీ అగ్రగామి మారుతీ సుజుకీ సరఫరా 1,41,312 నుంచి 21 % పెరిగి 1,70,971 యూనిట్లకు చేరింది. మహీంద్రా అండ్ మహీంద్రా 56,336 యూనిట్లను సరఫరా చేసింది. ఇదే నవంబర్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా డీలర్లకు 50,340 యూనిట్లను పంపిణీ చేసింది. చక్రవాహనాల పంపిణీలో 21% వృద్ధి నమోదైంది. ఈ నవంబర్‌లో మొత్తం సరఫరా 16,04,749 యూనిట్ల నుంచి 19,44,475 చేరింది. మోటార్‌సైకిల్ విభాగంలో 11,63,751 యూనిట్లు, స్కూటర్ల విభాగంలో 7,35,753 యూనిట్ల సరఫరా జరిగింది. అయితే మోపెడ్ సిగ్మెంట్‌లో 2% క్షీణత నమోదైంది. మొత్తం 45,923 యూనిట్ల నుంచి 44,971 యూనిట్లకు పరిమితమయ్యాయి. త్రీ వీలర్స్ అమ్మకాలు 21% వృద్ధితో 71,999 యూనిట్లుగా నమోదయ్యాయి. "పండుగ డిమాండ్ కొనసాగింపు, కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ 2.0 సంస్కరణ దన్ను భారతీయ ఆటో పరిశ్రమ నవంబర్‌లోనూ అమ్మకాల జోరును కనబరించింది. ప్యాసింజర్, టూ వీలర్స్, త్రీ వీలర్స్ విభాగాలకు సంబంధించి ఈ ఏడాదిలో నవంబర్ అత్యధికంగా అమ్ముడైన నెలగా రికార్డు సృష్టించింది. ప్రజారంజకనమైన ప్రభుత్వ సంస్కరణలు, మెరుగుపడుతున్న మార్కెట్ సెంటిమెంట్‌తో వచ్చే ఏడాది (2026)లోనూ ఇదే వృద్ధి నమోదవుతుందని పరిశ్రమ ఆశాభావంతో ఉంది" అని సియామ్ డైరెక్టర్ రాజేశ్ మీనన్ తెలిపారు.


## జియో లేటెస్ట్ రీఛార్జ్ ప్లాన్స్: యూజర్లకు పండగే!

రిలయన్స్ జియో తన కొత్త ప్రీపెయిడ్ టారిఫ్ పోర్ట్‌ఫోలియోను "హ్యాపీ న్యూ ఇయర్ 2026" ప్లాన్‌లను ఆవిష్కరించింది. ఇందులో నెల రోజుల ప్లాన్, ఏడాది ప్లాన్ రెండూ ఉన్నాయి. ఈ కొత్త రీఛార్జ్ ప్లాన్స్ వివరాలు ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం. ఏడాది పాటు రీఛార్జ్ కావాలనుకునే వారి కోసం రిలయన్స్ జియో ఈ ప్లాన్ పరిచయం చేసింది. రూ. 3599లతో రీఛార్జ్ చేసుకుంటే.. 365 రోజులు చెల్లుబాటు అవుతుంది. రోజుకు 2.5 జీబీ 5జీ డేటా, 100 %వాహీ%లు, అపరిమిత కాల్స్ పొందవచ్చు. అదనంగా గూగుల్ జెమిని ప్రో ప్లాన్‌కు 18 నెలల ఉచిత సబ్‌స్క్రిప్షన్‌ను పొందవచ్చు.

**సూపర్ సెలబ్రేషన్ మంత్లీ ప్లాన్**

సూపర్ సెలబ్రేషన్ మంత్లీ ప్లాన్ పేరుతో 500 రూపాయల రీఛార్జ్ ప్లాన్ కూడా జియో ప్రకటించింది. ఇది 28 రోజుల చెల్లుబాటు ఉన్నప్పటికీ.. రోజుకు 2జీబీ డేటా, 100 SMS\T, అపరిమిత కాల్స్ పొందవచ్చు. అదనంగా ఓటీటీ ప్రయోజనాలు (యూట్యూబ్ ప్రీమియం, జియో హాట్‌స్టార్, సోని లివ్, జీ5 మొదలైనవి) లభిస్తాయి. యాన్యువల్ ప్లాన్ మాదిరిగానే 18 నెలల ఉచిత గూగుల్ జెమిని ప్రో ప్లాన్ కూడా పొందవచ్చు. ఫ్లెక్సీ ప్యాక్ పేరుతో.. 103 రూపాయల రీఛార్జ్ ప్లాన్ కూడా తీసుకొచ్చింది. దీని వ్యాలిడిటీ 28 రోజులు మాత్రమే. అయితే ఇందులో కేవలం డేటా మాత్రం లభిస్తుంది. ఈ ప్లాన్ రీఛార్జ్ చేసుకున్న వినియోగదారుడు.. హిందీ, ఇంటర్నేషనల్, ప్రాంతీయ ప్యాక్‌లలో ఏదో ఒకదాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది.

# ఈవీ బ్యాటరీలకు భారీ డిమాండ్



భారత్‌లో ఎలక్ట్రిక్ వాహన బ్యాటరీ (ఈవీ బ్యాటరీ) డిమాండ్ వచ్చే ఏడేళ్లలో గణనీయంగా పెరనుందని కస్టమైజ్డ్ ఎనర్జీ సొల్యూషన్స్ (సీఈఎస్) సంస్థ అంచనా వేసింది. 2025లో ఈవీ బ్యాటరీ డిమాండ్ 17.7 గిగావాట్ హవర్ (జీడబ్ల్యూహెచ్) ఉండగా, 2032 నాటికి 256.3 గిగావాట్లకు చేరుకోనున్నట్టు తెలిపింది. ఏటా 35 శాతం కాంపౌండెడ్ వృద్ధి (సీఏజీఆర్) ఈ రంగంలో నమోదు కావొచ్చని అంచనా వేసింది. ఇంధన ధరలు పెరుగుతుండడం, ఎలక్ట్రిఫికేషన్‌ను ప్రభుత్వాలు ప్రోత్సహిస్తుండడం, వినియోగదారుల నుంచి బలమైన డిమాండ్, ఎప్పటికప్పుడు కొత్త మోడళ్లు విడుదల అవుతుండడం, విధానపరమైన మద్దతు అన్నీ కలసి ఈవీ మార్కెట్ భారీ వృద్ధికి అనుకూలిస్తున్నట్టు తన నివేదికలో సీఈఎస్ వివరించింది. "భారతదేశ ఎలక్ట్రిక్ వాహన విప్లవానికి బ్యాటరీ కెమిస్ట్రీ పురోగతులు కీలకమైనవి. ఎల్ఎఫ్‌పీ జెన్ 4, సోడియం అయాన్ టెక్నాలజీ ఆవిష్కరణలు కేవలం సాంకేతికపరమైన పురోగతులే కాదు. ఎలక్ట్రిక్ వాహనాలను మరింత అందుబాటు ధరలకు తీసుకొచ్చే సంచలనాలు. సురక్షితమైన, ఒక్కచార్జ్‌తో మరింత దూరం ప్రయాణించేందుకు వీలు కల్పిస్తాయి"అని సీఈఎస్ ఎండీ వినాయక్ వలింబే తెలిపారు. ఎల్ఎఫ్‌పీ జెన్4 సెల్స్ అన్నవి ఇప్పుడు 300 వాట్‌హవర్/కిలోని అధిగమించాయంటూ.. ఎక్కువ దూరం ప్రయాణించేందుకు, ధరలు తగ్గేందుకు అనుకూలిస్తాయ ఈ నివేదిక తెలిపింది.

సవాళ్లను అధిగమించాలి..

భారత్ తన ఎలక్ట్రిఫికేషన్ (ఎలక్ట్రిక్ వాహనాలకు మళ్లడం) లక్ష్యాలను సాధించేందుకు వీలుగా పరిశ్రమతో సహకారం, బలమైన బ్యాటరీ ఎకోసిస్టమ్ ఏర్పాటు, వ్యూహాత్మక పెట్టుబడుల సవాళ్లను అధిగమించేందుకు విధానపరమైన జోక్యం అవసరమని సీఈఎస్ నివేదిక సూచించింది. బ్యాటరీల్లో వినియోగించే కీలక ముడి పదార్థాలను, ఖనిజాలపై చైనా నియంత్రణలు.. భారత్‌లో గిగాఫ్యాక్టరీల నిర్మాణాన్ని నిదానింపజేయొచ్చని, సరఫరా వ్యవస్థ రిస్క్‌లకు దారితీయొచ్చని హెచ్చరించింది. అధిక ఆరంభ పెట్టుబడులకుతోడు, దేశీయంగా ఖనిజ నిల్వలు పరిమితంగా ఉండడం భారత స్వావలంబన లక్ష్యాలకు విఘాతం కలిగిస్తాయని పేర్కొంది.


# స్టేట్ బ్యాంకు శుభవార్త.. అప్పు తీసుకున్నోళ్లకు..

తమ బ్యాంకులో అప్పు తీసుకున్నోళ్లకు ప్రభుత్వ అతిపెద్ద బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుభవార్త చెప్పింది. కేంద్ర బ్యాంకు ఆర్బీఐ ఇటీవల రెపో రేటును తగ్గించిన తరువాత, ప్రధాన బ్యాంకులు ఈ ప్రయోజనాలను వినియోగదారులకు బదిలీ చేసే పనిలో ఉన్నాయి. తాజాగా ఎస్‌బీఐ కూడా తన కీలక రుణ రేట్లో మార్పులు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్ (ఎంసీఎల్ఆర్), ఎక్స్‌టర్నల్ బెంచ్మార్క్ లెండింగ్ రేట్ (ఈబీఎల్ఆర్), రెపో లింక్డ్ లెండింగ్ రేట్ (ఆర్ఎల్ఎల్ఆర్), బెంచ్మార్క్ ప్రైమ్ లెండింగ్ రేట్ (బీపీఎల్ఆర్), బేస్ రేట్లో కోతలు ఉన్నాయి. డిసెంబర్ 15 నుండి ఈ మార్పులు అమల్లోకి రానున్నాయి. మారిన వడ్డీ రేట్లతో ఈ బ్యాంకులో రుణ గ్రహీతలకు వడ్డీ భారం తగ్గనుంది. నెలవారీ వాయిదాలు (%జువీ×%) తగ్గుతాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇటీవల రెపోరేటు అంటే వాణిజ్య బ్యాంకులకు తాత్కాలికంగా ఇచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీ రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో ఇది 5.25 శాతానికి తగ్గింది. వృద్ధికి తోడ్పడటానికి ఈ ఏడాది నాల్గవసారి కీలక వడ్డీ రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించాలని గత వారం ఆర్‌బీఐ విధాన కమిటీ నిర్ణయం తీసుకుంది.

చాలా రిటైల్ రుణాలకు కీలకమైన ఎంసీఎల్ఆర్ రేటును అన్ని కాలపరిమితిలలోనూ ఎస్‌బీఐ తగ్గించింది. ఓవర్‌నైట్, ఒక నెల రేట్లు 7.90% నుండి 7.85%కి తగ్గాయి. మూడు నెలల ఎంసీఎల్ఆర్ 8.30 శాతం నుంచి 8.25 శాతానికి రాగా, ఆరు నెలల ఎంసీఎల్ఆర్ 8.65 శాతం నుంచి 8.60 శాతానికి తగ్గింది. అనేక గృహ, వాహన రుణాలకు ఉపయోగించే క్లిష్టమైన ఒక సంవత్సరం కాలపరిమితి రుణ రేటు 8.75% నుండి 8.70%కి దిగొచ్చింది. ఇక రెండేళ్ల టెన్యూర్ రుణాలపై 8.80% నుండి 8.75%, మూడేళ్ల కాలపరిమితి లోన్లపై 8.85 % నుండి 8.80 శాతానికి వడ్డీని ఎస్‌బీఐ సవరించింది. క్రెడిట్ రిస్క్ ప్రీమియం బ్యాంక్ స్ప్రెడ్ (%దీట్రా%)తో కూడిన ఈబీఎల్ఆర్‌ను ఎస్‌బీఐ 8.15% నుండి 7.90%కి తగ్గించింది. ఆర్బీఐ రెపో రేటుతో నేరుగా ముడిపడి ఉన్న ఆర్ఎల్ఎల్ఆర్ 7.75% ం %జఙా% నుండి 7.50% +CRP కి దిగొచ్చింది. ఫలితంగా రుణగ్రహీతలు తమ రిస్క్ ప్రొఫైల్ ఆధారంగా ఈఎంఐలలో తగ్గింపులను చూస్తారు.

# పసిడి ధర మరింత పెరుగుతుందా?

బంగారం ధరలు అదే పనిగా ర్యాలీ చేస్తుండం తప్పకుండా ఆకర్షిస్తుంది. అవును బంగారం ధరలు ఇటీవలి కాలంలో గణనీయమైన రాబడిని ఇచ్చాయి. కానీ, ఇంకెంత పెరుగుతుందన్నది సమాధానం లేని ప్రశ్నే అవుతుంది. ఏ అసెట్ క్లాస్‌కు అయినా ఇదే వర్తిస్తుంది. కనుక దీనికి బదులు మీ పెట్టుబడుల్లో బంగారాన్ని చేర్చుకోవడం వల్ల ఒనగూరే ప్రయోజనాలనే పరిగణనలోకి తీసుకోవాలి. అనిశ్చితుల్లో బంగారం మంచి పనితీరు చూపిస్తుంటుంది. ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల సమయంలో లేదా ఈక్విటీ మార్కెట్లు ఆటుపోట్లను ఎదుర్కొంటున్న తరుణంలో బంగారం ధరలు పెరుగుతుంటాయి. అలాంటి అనిశ్చితులన్నీ సర్దుకుని, ఆర్థిక వ్యవస్థలు మంచి పనితీరు చూపిస్తుంటే అప్పుడు బంగారం పనితీరు పరిమితం అవుతుంది. గత 15 ఏళ్లలో బంగారం ఏటా 10 శాతం రాబడిని అందించింది. వివిధ రంగాలు, పరిమాణంతో కూడిన కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసే ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ ఇదే కాలంలో ఏటా ఇచ్చిన రాబడి 12 శాతంగా ఉంది. రాబడిలో వ్యత్యాసం స్వల్పమే అయినప్పటికీ దీర్ఘకాలంలో కాంపౌండింగ్ కారణంగా చెప్పుకోతగ్గంత అదనపు నిధి సమకూరుతుంది. ఈక్విటీలు అన్నవి వ్యాపారాల్లో వాటాలను అందిస్తాయి. అవి సంపదకు వీలు కల్పిస్తాయి. బంగారం కేవలం నిల్వ ఉంచుకునే సాధనమే. కనుక ఇన్వెస్టర్లు తమ ప్రాధాన్యతలకు అనుగుణంగా మొత్తం పెట్టుబడుల్లో 10 శాతం వరకు బంగారానికి కేటాయించుకోవచ్చు.



# 'విశ్వంభర' విడుదల ఎప్పుడంటే..

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న సోషియో ఫాంటసీ ఫిల్మ్ 'విశ్వంభర'.. వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీ 2025 సంక్రాంతికి విడుదల కావాల్సి ఉంది. ఆ సమయంలో గేమ్ ఛేంజర్ కోసం చిరు వాయిదా వేసుకున్నారు. అపై టీజర్ విషయంలో ఫ్యాన్స్ కూడా చాలా నిరాశ చెందడంతో వాయిదానే బెటర్ అనుకున్నారు. అందులో గ్రాఫిక్స్ వర్క్ చాలా పేలవంగా ఉందని విమర్శలు రావడంతో మార్పులు చేయాలనుకున్నారు. అయితే, ఎప్పుడు రిలీజ్ అనేది ఇప్పటికీ అధికారికంగా ప్రకటించలేదు. ఇంతలో 'మన శంకర వరప్రసాద్ గారు' లైన్‌లోకి వచ్చేశాడు. మరో పదిరోజుల్లో విడుదల కూడా కానుంది. కానీ, విశ్వంభర గురించి ఎలాంటి ప్రకటన రాలేదు. 'విశ్వంభర' టీజర్ విషయంలో విమర్శలు రావడంతో దర్శకుడు వశిష్ఠ పక్కా ప్లాన్‌తో ఈ ఏడాది మొత్తం విశ్వంభర గ్రాఫిక్స్ వర్క్ కోసం కేటాయించి బలమైన ఔట్‌పుట్‌ను ఇచ్చారని తెలుస్తోంది. విజువల్ ఎఫెక్ట్స్‌పై విస్తృతంగా పరిశీలించి అనేక మార్పులు చేశారట. అయితే, తాజా నివేదికల ప్రకారం 'విశ్వంభర' జూన్ 2026 విడుదలను లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. 'మన శంకర వరప్రసాద్ గారు' జనవరి 2026లో వస్తున్నందున, రెండు విడుదలల మధ్య ఆరోగ్యకరమైన అంతరాన్ని కొనసాగించాలని మేకర్స్ ఉన్నారట. విశ్వంభర తుది అవుట్‌పుట్‌ను మెగాస్టార్ ఆమోదించిన తర్వాత మాత్రమే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.ప్రపంచంలోనే టాప్ వీఎఫ్ఎక్స్ కంపెనీలు విశ్వంభర కోసం పనిచేస్తున్నాయి. ప్రపంచస్థాయి విజువల్ ఎఫెక్ట్స్ అందించాలని వశిష్ఠ తన ప్లాన్ మార్చుకున్నారు. పాన్ ఇండియా రేంజ్‌లో రానున్న ఈ సినిమాలో చిరంజీవి సరసన త్రిష, ఆషికా నటిస్తున్న విషయం తెలిసిందే. అత్యంత భారీ బడ్జెట్‌తో యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది.



# చలో కేరళ

కేరళ కాలింగ్ అంటున్నారట హీరో నాగార్జున. ఆయన కెరీర్‌లోని వందో సినిమా 'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఆర్.ఏ కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఆల్రెడీ చిత్రీకరణ మొదలైంది. కాగా ఈ సినిమా కోసం ఓ షెడ్యూల్‌ని కేరళలో ప్లాన్ చేశారట మేకర్స్. ఇందుకోసం నాగార్జున త్వరలోనే కేరళ వెళ్తారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. జనవరి మొదటివారంలో కేరళ షెడ్యూల్ స్టార్ట్ అవుతుందట. నాగార్జునపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారని టాక్. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నాగార్జున నిర్మిస్తున్న ఈ సినిమా 2026లో విడుదల అవుతుందని తెలిసింది.

# విశాల్‌కు జతగా కయాదు లోహర్?

హిట్ కాంబోకు శ్రీకారం పడనుందా అంటే అవుననే సమాధానమే వస్తోంది కోలీవుడ్ వర్గాల నుంచి. నటుడు విశాల్, దర్శకుడు సుందర్.సిలది హిట్ కాంబో అనే చెప్పాలి. వీరి కాంబినేషన్‌లో ఇంతకు ముందు ఆంబళ అనే చిత్రం తెరకెక్కించి మంచి కమర్షియల్ హిట్ సాధించింది. అదే విధంగా అంతకు ముందు రూపొందిన మదగజరాజా చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని 12 ఏళ్ల తరువాత తెరపైకి వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. తాజాగా ఈ హిట్ కాంబో హ్యాట్రిక్‌కు రెడీ అవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం మకుటం చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విశాల్ తదుపరి సుందర్.సి దర్శకత్వంలో నటించడానికి సిద్ధం అవతున్నట్లు సమాచారం. అదే విధంగా ప్రస్తుతం నయనతార ప్రధాన పాత్రలో నటిస్తున్న మూక్కుత్తి అమ్మన్%-%2 చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్న సుందర్.సీ తదిపరి రజనీకాంత్ హీరోగా కమలహాసన్ నిర్మించే చిత్రానికి దర్శకత్వం వహించాల్సి ఉంది. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా విడుదలయ్యింది.అలాంటిది అనూహ్యంగా ఆ చిత్రం నుంచి సుందర్.సీ వైదొలిగారు. దీంతో తదిపరి ఆయన విశాల్ హీరోగా చిత్రం చేయడానికి సిద్ధం అవుతున్నారు. దీన్ని సుందర్.సీ సొంత నిర్మాణ సంస్థ అవనీ పిక్చర్స్ సంస్థ నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తాజా సమాచారం. ఈ చిత్రానికి సుందర్.సీ ఆస్థాన సంగీతదర్శకుడు హిప్‌హాప్ ఆది సంగీతాన్ని అందించనున్నట్లు తెలిసింది. ఇకపోతే సుందర్.సీ చిత్రాల్లో కథానాయికలకు ప్రాముఖ్యత ఉంటుంది. అదే సమయంలో గ్లామర్ సన్నివేశాలకు కొదవ ఉండదు. ఇంతకు ముందు ఆంబళ చిత్రంలో విశాల్‌కు జంటగా హన్సిక నటించారు. మదగజరాజా చిత్రంలో అంజలి, వరలక్ష్మీ శరత్‌కుమార్ నటించారు.



# ఆరోగ్యానికి అరటి దూట కూర.. నటి సమీరా రెడ్డి స్పెషల్ రెసిపీ

నటి సమీరా రెడ్డి తన సోషల్ మీడియా వేదికగా తరచూ ఆరోగ్య చిట్కాలను పంచుకుంటూ ఉంటారు. తాజాగా ఆమె ఉదర ఆరోగ్యానికి (గట్ హెల్త్) ఎంతో మేలు చేసే అరటి దూట, పప్పు రెసిపీని అభిమానులతో పంచుకున్నారు. రుచితో పాటు ఆరోగ్యాన్ని అందించే ఈ రెసిపీ తయారీ విధానాన్ని, దాని ప్రయోజనాలను ఆమె వివరంగా తెలిపారు. ఈ కూర తయారీకి ముందుగా శుభ్రం చేసిన అరటి దూట ముక్కలు, కంది లేదా పెసరపప్పును పసుపు, ఉప్పు వేసి ప్రెషర్ కుక్కర్‌లో మెత్తగా ఉడికించాలి. ఆ తర్వాత పచ్చి కొబ్బరి తురుము, పచ్చిమిర్చి, జీలకర్ర కలిపి మెత్తని పేస్ట్‌గా చేసుకోవాలి. ఇప్పుడు నేతిలో ఆవాలు, ఎండుమిర్చి, కరివేపాకుతో తాలింపు పెట్టి, ఉడికిన పప్పు-దూట మిశ్రమంలో కలపాలి. చివరగా కొబ్బరి పేస్ట్ కూడా వేసి కొన్ని నిమిషాలు ఉడికిస్తే కూర సిద్ధమవుతుంది. కూర వల్ల కలిగే ప్రయోజనాలను కూడా సమీరా వివరించారు. "దీనిలో ఫైబర్, ఐరన్ పుష్కలంగా ఉండటం వల్ల నీరసం తగ్గుతుంది. హార్మోన్ల సమతుల్యతకు, జీర్ణవ్యవస్థ శుభ్రతకు ఇది తోడ్పడుతుంది. ఉబ్బరం, శరీరంలో నీరు చేరడం వంటి సమస్యలను తగ్గిస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి, నెలసరి సమస్యలతో బాధపడేవారికి, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించుకోవడానికి కూడా ఈ కూర ఎంతో ఉపయోగపడుతుంది" అని ఆమె పేర్కొన్నారు.

# అల్లు అర్జున్ కోసం... బెల్జియంలో మూతపడిన రెస్టారెంట్ తెరుచుకుంది...!

పపంచవ్యాప్తంగా ఉన్న సెలబ్రిటీలకు అత్యంత విలాసవంతమైన సేవలను అందించే లగ్జరీ కాన్సియర్జ్ సర్వీస్ సంస్థ సీఈవో కరణ్ భంగే అల్లు అర్జున్‌కి సంబంధించిన ఒక ఆసక్తికరమైన సందర్భాన్ని పంచుకున్నారు. బెల్జియం పర్యటనలో ఉన్న అల్లు అర్జున్, ఆయన స్నేహితుల బృందం గురించి ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు "అల్లు అర్జున్ బెల్జియం పర్యటనలో ఒక రెస్టారెంట్‌లో పుట్టినరోజు వేడుకను నిర్వహించాలనుకున్నారు. కానీ అది సీజన్ కాకపోవడంతో ఆ రెస్టారెంట్ మూతపడింది. అయినప్పటికీ, బన్నీ కోసం ఆ ఒక్క సాయంత్రం మొత్తం రెస్టారెంట్‌ను ప్రత్యేకంగా తెరిచి, వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దీని కోసం భారీ మొత్తంలో ఖర్చయిందని... ఆ రెస్టారెంట్ ఒక వారంలో సంపాదించే మొత్తాన్ని ఆ ఒక్క పూటకే చెల్లించారని కరణ్ భంగే వివరించారు. కేవలం రెస్టారెంట్ తెరవడమే కాదు, అల్లు అర్జున్ బృందం కోసం వారి అభిరుచికి సరిపడే భారతీయ వంటకాలు, సంగీతం కూడా ఏర్పాటు చేశారు. తాము చాలా హాలీవుడ్, బాలీవుడ్ స్టార్ల కోసం సేవలు అందించినప్పటికీ... అల్లు అర్జున్ బృందం కోరిక మేరకు చేసిన ఏర్పాట్లు ప్రత్యేక అనుభవాన్ని అందించాయి"అని చెప్పారు.





# క్రేజీ ప్రాజెక్ట్

సాయికుమార్ హీరోగా కొత్త సినిమా ప్రకటన వచ్చింది. హాస్య మూవీస్ అధినేత, రైజింగ్ ప్రొడ్యూసర్ రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఆది హీరోగా నటించిన 'శంబాల' చిత్రం ఈ నెల 25న విడుదలైంది. ఈ సినిమా మంచి విజయం సాధించడంతో ఆదిని కలిసి, శుభాకాంక్షలు తెలిపారు రాజేష్ దండా. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ%-"మా హాస్య మూవీస్‌పై 'ఊరిపేరు భైరవకోన, సామజవరగమన, మజాకా, కె-ర్యాంప్' వంటి పలు హిట్ సినిమాలు నిర్మించాను. అలాగే మా బ్యానర్‌లో మరికొన్ని ఆసక్తికరమైన ప్రాజెక్ట్స్ నిర్మాణంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే నెక్ట్స్ మూవీ ఆదితో ఉంటుంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను త్వరలోనే వెల్లడించనున్నాం" అని తెలిపారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.